ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

29 మే, 2011

ENTERED

కరుణైక కుటుంబం

హ్యాపీబర్త్‌డే

(2011 మే 29 నుంచి
2011 జూన్ 4 వరకు)

ఎన్.కీర్తన(రశ్మి)
3సం॥, మే-31
శిరీష-మారన్న
రాంనగర్-హైదరాబాద్

జి.శ్రీరాం
జూన్-1
శివసామ్రాజ్యం-కోటేశ్వరరావు
చీమకుర్తి-ప్రకాశం

జి.సాత్విక్
1సం॥, మే-2010
సరిత-నరేష్
అనుముల-నల్లగొండ

డి.యశ్విత
1సం॥,మే-2010
హరిప్రియ-ప్రసాద్
బాగ్‌లింగంపల్లి-హైదరాబాద్

పండు
2సం॥, మే-29
సరస్వతి-లోకేశ్వర్
హైదరాబాద్

బి.పవన్- సంధ్య
జూన్-1
సామెల్-జంగయ్య
ఇబ్రహీంపట్నం

భావన
9సం॥, మే-2002
పద్మజ-జోగారావు

బి.మృదుల
5సం॥,జూన్-2
హేమ-నాగనాథరావు
గుంతకల్లు-అనంతపురం

నన్నీ
జూన్-1
రేవతి-నారాయణరెడ్డి
అక్కాయపల్లి-కడప

వి. మౌనిక
జూన్-1
హైమావతి-వెంకటేశం
భువనగిరి-నల్లగొండ

వి.ప్రణయ్
6సం॥,మే-31
విజయలక్ష్మి-ఉత్తమ్‌కుమార్
రోటరీనగర్-ఖమ్మం

ENTERED

మనలో మాట

...కిం కర్తవ్యం?!

సిగరెట్...మొదట్లో సరదా. కాలక్రమేణా అదో హాబీ. తుదకు అదే పనిగా తగలేయడం ఒక వ్యసనమౌతుంది. చివరికి అదే మనిషిని తాగేస్తుంది. 'ధూమపానం దురలవాటు. కాల్చొద్దురా బాబులూ' అని పెద్దలు, డాక్టర్లు అరచి గగ్గోలు పెట్టినా పొగరాయుళ్లు ససేమిరా ఒప్పుకోరు. పైగా 'సరదా సరదా సిగరెట్టు ఇది దొరల్ తాగు బలె సిగరెట్టు. పట్టు బట్టి ఒక దమ్ము లాగితే స్వర్గానికే తొలిమెట్టు' అంటూ కింగ్ సైజు సిగరెట్టును తలపించే ఫోజు పెట్టేస్తారు. 'కంపు కొట్టు ఈ సిగరెట్టు తాగితే కాలు నిండునా కడుపు నిండునా వదిలిపెట్టవోయ్ నీ పట్టు' అంటే వినేవాడెవ్వడు? పైగా 'పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్' అంటూ గిరీశంలా దబాయించేస్తారు. స్థలం, సమయం, సందర్భాల పట్టింపు లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా గుప్పుగుప్పుమని పొగ మేఘాలు సృష్టిస్తూ ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతుంటారు కొందరు. చర్చిల్‌నో, కాస్ట్రోనో, చాసోనో తల్చుకొని కేవలం సిగార్ మాత్రమే వెలిగించేవారు వున్నట్టే 'ఖగరాట్ కృషి ఫలితంగా / పొగాకు భూలోకమందు పుట్టెనుగానీ / పొగచుట్టలెన్నియైనను సిగరెట్టుకు సాటిరావు సిరిసిరిమువ్వా' అన్న శ్రీశ్రీ పద్యాన్ని తల్చుకుంటూ సిగరెట్లు మాత్రమే ముట్టించేవారున్నారు. చుట్టయినా సిగరెట్టయినా పొగ పొగే. అది పెట్టే సెగ సెగే.

'నువ్వు కాల్చే సిగరెట్టు నీ బతుక్కే పొగబెట్టు' అని పొగరాయుళ్లకు శ్రేయోభిలాషులు ఎప్పటికప్పుడు చెప్తూనే వుంటారు. 'పొగ తాగడం...ఆరోగ్యానికి హానికరం' అని సిగరెట్ పెట్టెమీద కూడా వుంటుంది. ఒక్క సిగరెట్ 8 నిముషాల జీవితకాలాన్ని తగ్గిస్తుందని పరిశోధనలు ఘోషిస్తున్నాయి. మీ వ్యసనానికి తగలేసే ఖర్చుతో జీవితాంతం ఇద్దరు అనాథ పిల్లలను దత్తత తీసుకోవచ్చు బాబులూ అని అనుభవజ్ఞులు మొత్తుకుంటారు. పొగరాయుళ్లకు ఇవేమీ చెవికెక్కవు. వేలెడంత లేని సిగరెట్టు చెట్టంత మనిషిని ఏం చేస్తుందిలెమ్మని విర్రవీగుతూ మరింత రెచ్చిపోయి దమ్ము లాగుతారు. ఆ వేలెడంత సిగరెట్టే చెట్టంత మనిషి పీక పట్టేస్తుందని తెలిసివచ్చేసరికే జరగాల్సింది జరిగిపోతుంది.

స్మో'కింగ్'లను కట్టడి చేసేందుకు ఎక్కుపెట్టిన చట్టాలూ పొగచూరిపోతున్నాయి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు కాదేదీ పొగ చూరడానికి అనర్హం అన్న చందంగా మారింది. ఏ చట్టాన్ని, ఎవరి హితబోధనీ లెక్కచెయ్యనివ్వదు సిగరెట్టు. పొరపాటునో, గ్రహపాటునో ఒకవేళ మానుకుందామనుకున్నా...అదిగో దసరాకు మానుకుందాం. ఇదిగో సంక్రాంతికి మానుకుందాం...ఇవేవీ కాదు కొత్త సంవత్సరం సందర్భంగా మానేద్దాం అంటూ నిర్ణయాల మీద నిర్ణయాలు తీసుకుంటారు. అతి కష్టమ్మీద కొద్ది రోజులు మానేసినా మళ్లీ మొదటికొస్తుంది వ్యవహారం.

'సిగరెట్ మానేయడం చాలా సులభం తెలుసా... నేను చాలా సార్లు మానేశాను' అంటే ఫలితముండదు సుమా...!

★

ఈ సంచికలో....

టపా	...	2
చిన్న కథ	...	5
కవిత్వమ్	...	6
నవ్వుల్ పువ్వుల్	...	7
సినిమా కబుర్లు	...	8
ఈ పేజ్	...	10
రుచి	...	11
అట్టమీది కథ	...	14
కథ	...	18
వికాసం	...	20
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

జ్ఞాపకాలు ... 4

ఉత్తమ చిత్ర విమర్శకుడు చిదానంద దా!

చూద్దామా ... 12

వచ్చే వచ్చే అందాల కొచ్చి

కొత్త పుస్తకాలు ... 21

కొత్తమార్గం



చక్కటి విహార యాత్ర

న్యూయార్క్‌లో విహారయాత్ర ఆసక్తికరంగా ఉంది. నేషనల్ మ్యూజియం ఆఫ్ యునైటెడ్ స్టేట్స్ విశేషాలు చక్కగా తెలిపారు. ఇంకా నేటి ఆధునిక స్థితిగతులు చదువుతుంటే ఆసక్తికరంగా ఉన్నాయి.

నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.

కొత్త వెలుగులు

పాఠకులతో స్నేహ విడదీయరాని అక్షరానుబంధాన్ని ఏర్పరచుకుంటోంది. ఆకర్షణీయమైన అంశాలతో ఆకట్టుకుంటోంది. ప్రతిఅంశం విజ్ఞానదాయకంగా, వినోదాత్మకంగా రూపుదిద్దుకుంటోంది. ఈ వారం 'పాతబంగారం' శీర్షిక పాతదే అయినా ఎప్పటికీ కొత్తవెలుగులు ప్రకాశింపజేస్తున్నట్లు అనిపించింది. అలనాటి చలన చిత్ర సీమకు ప్రాణం పోసిన పి.వి.దాసుగారి గురించి చక్కగా వివరించినందుకు ధన్యవాదాలు. 'రుచి'లో మామిడి వెరైటీలు నోరూరించాయి. 'చూద్దామా' అంటూ న్యూయార్క్‌లో విహరింపజేశారు. 'నోటు ఆత్మకథ' లోని అంశం అందరినీ ఆలోచింపజేసేదిగా ఉంది. 'మాటలకోట' ఆలోచనలకు మంచి పునాది వేస్తోంది.

టి.వి.డి.ఎన్. సీతారామారావు,
విజయవాడ.

శృతి మించితే...

'**మ**నలో మాట'లో నేడు సర్కారు పనితీరు ఎలా ఉంటోందో వివరించారు. దేశాన్ని ఏలే నాయకులకు ప్రజలు వేసే ఓట్లు కావాలి. కానీ వారి బాగోగుల సంగతి ఏ మాత్రం పట్టదు. 'వికాసం'లో ఊసుబోని కబుర్ల వల్ల ఒక్కోసారి ఎంతటి ప్రమాదాలు వస్తాయో తెలిపారు. సరదాగా చెప్పుకునే కబుర్లు కొంతవరకు బాగానే ఉంటాయి. కానీ శృతి మించితే జీవితాలే మారిపోయే పరిస్థితి వస్తుంది.

విజయ్, గుంటూరు.

వెన్నతో పెట్టిన విద్య

ఏప్రిల్ 29న పాకిస్తాన్‌లో లాడెన్ నివాసంపై అమెరికా హెలికాప్టర్లు దాడిచేసి అతన్ని హత్యచేసిన సంఘటన వెనుక అర్థం కాని ఎన్నో ప్రశ్నలు దాగి ఉన్నాయి. లాడెన్‌ని మొదట పెంచి పోషించింది అమెరికానే. ముస్లిం మతోన్మాదాన్ని రెచ్చగొట్టేందుకు అమెరికన్లే తాలిబన్లను, అల్‌ఖైదా తీవ్రవాదులను సృష్టించారు. తన సామ్రాజ్య విస్తరణే ఆ దేశ వికృత చర్యలకు కారణం. లాడెన్ లాంటి వారిని పెంచి పోషించడం, అవసరం తీరాక తనను ధిక్కరిస్తున్నారనుకున్నప్పుడు తుదముట్టించడం దానికి వెన్నతో పెట్టిన విద్య.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

సెలవుల సద్వినియోగం

ఈ వారం కథ బాగుంది. నోటు అచ్చయిన తర్వాత ఎందరి దగ్గరికి వెళ్తుందో, ఎంతమంది అవసరాలు తీరుస్తుందో దానికే తెలీదు. అందరికీ ఉపయోగపడాల్సిన డబ్బు కొందరు బడా బాబుల ఇనప్పెట్టెల్లోనే బందీ అవుతోంది. వారి అధికార దాహానికి ఉపయోగపడుతోందే గానీ దాని అవసరం ఉన్న వారికి మాత్రం అందుబాటులో ఉండదు. డా॥ నిరంజన్ అందించిన 'వినోదం... విజ్ఞానం' శీర్షికలో వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు ఎలా ఉండాలి? సెలవులను ఎలా సద్వినియోగం చేసుకోవాలి?... వంటి ఎన్నో విషయాలను అందించారు. పిల్లల్లో సృజనాత్మకతను ఎలా పెంపొందించాలో తెలిపినందుకు ధన్యవాదాలు.

కె.అమర్‌నాథ్, మరికల్, రంగారెడ్డి.

కంటిచూపు చాలు...

'**ఈ** పేజ్' వ్యాసాలు చదవడం



వల్ల కొత్త టెక్నాలజీ గురించి తెలుసుకోగలుగుతున్నాం. ఇప్పటి వరకు టచ్ స్క్రీన్ లాప్‌టాప్‌లనే చూశాం. అతి త్వరలో కంటి చూపుతో పనిచేసే లాప్‌టాపులు వస్తున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. 'పాత బంగారం'లో అలనాటి సినిమా రంగానికి సంబంధించిన ఎన్నో విషయాలను అందిస్తున్న రెంటాల జూనియర్‌కి అభినందనలు. ఒసామాకు, అమెరికాకు మధ్య ఉన్న సంబంధాన్ని 'అట్టమీద కథ'లో వివరించారు. అమెరికా తన అవసరానికి లాడెన్‌ను ఓ తీవ్రవాదిలా తయారు చేసింది. కాని కొంతకాలానికి లాడెన్ అమెరికాకే వ్యతిరేకంగా తయారయ్యాడు. అందుకే అతనిని చంపేయించింది. అలా ఎదురు తిరిగిన వాళ్లని చంపడం కూడా తప్పుకాదని అమెరికా సమర్థించుకుంటోంది. ఈ సామ్రాజ్యవాద దేశం ఎప్పటికి మారుతుందో ఏమో!

అప్పలాచారి, శ్రీకాకుళం.

★



హేయ్! దోమల్ని తోలుకోడానికి వాడికేదో దొరికినట్లుంది!!



హారర్ మూవీ

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-97890 99589

హలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE TM

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:** 93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:** 94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:** 98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:** 9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:** 228800, **Cell:** 9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:** 232502. **Cell:** 98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:** 93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:** 99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:** 93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:** 93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

జ్ఞాపకాలు

ఉత్తమ చిత్ర విమర్శకుడు చిదానంద దా!

గత వారం మరణించిన చిదానంద దాస్‌గుప్తా సినీ విమర్శకుడుగా దేశంలో అత్యున్నత స్థానం అలంకరించిన మేధావి, భావుకుడు, అదే సమయంలో సృజనకారుడు కూడా. అన్నిటినీ మించి ఆయన దేశంలో ఉత్తమాభిరుచికి పట్టం కట్టిన ఫిలిం సొసైటీ వుద్యమ వ్యవస్థాపకుడు, సత్యజిత్‌రే సహచరుడు.

భారతీయ మీడియా రంగంలో చలన చిత్ర విమర్శకుడి పట్ల చాలా చిన్న చూపు వుంటుందని తరచూ అంటుంటారు. ఉదాహరణకు ఒక రాజకీయ విలేకరికి, పరిశోధనాత్మక పాత్రికేయుడికి క్రీడా విశ్లేషకుడికి లభించే గౌరవాదరాలతో పోలిస్తే సినిమా రంగం చూసే వారిని పెద్దగా పట్టించుకోవడం జరగదు. ఇందుకు కారణాలు అనేకమైనా సినిమా రంగం స్వభావమే మొదటిది. స్వతహాగా ఆకర్షణ నింపుకున్న ఆ రంగంలో హేమాహేమీల మధ్య సాదాసీదా సినీ విలేకరి కనిపించడమే పెద్ద గొప్ప. ఒక వేళ ప్రచారం కోసం వారిని ప్రస్తావించినా అది కేవలం ప్రచారం వరకే పరిమితం. చిత్రం విడుదలైన తర్వాత విమర్శకులు విశ్లేషకులు ఏం రాసినా ప్రభావం వుండదని సినీ వర్గాలు భావిస్తాయి. ఆపైన తమ అడ్వర్టయిజ్‌మెంట్ అవసరాల కోసం మీడియా కూడా సినిమాల పట్ల మరీ కఠినంగా వుండక మృదు వైఖరినే అనుసరిస్తుంటుంది. ఆపైన అక్షరాస్యత అంతంతమాత్రంగా వుండే ప్రేక్షకులు అభిమాన తారలను చూసి అనందించడం తప్ప దానికి పెద్ద విమర్శ అవసరమని అసలే భావించరు. ఇన్ని కారణాల వల్ల భారతీయ సినీ విమర్శ కొడిగట్టి పోయింది.

చిదానంద దా 1921లో షిల్లాంగ్‌లో బ్రహ్మ సమాజీకులైన తలిదండ్రులకు పుట్టారు. పైగా వారికి సినిమాలంటే అసలే పడదు. చిదానంద కూడా 21 ఏళ్లు వచ్చేవరకూ దాదాపు సినిమాలు చూసింది లేదు. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నందుకు గాను ఆయనను పాట్నా నగరం నుంచి బహిష్కరించడంతో కొల్‌కతా చేరాడు. సంస్కరణ వాదులైన తలిదండ్రులు వ్యతిరేకించినా చిన్న వయసులోనే సుప్రియను పెళ్లి చేసుకుని ఉద్యోగంలో చేరారు. కొల్‌కతాలో సత్యజిత్ రే పరిచయం ఆయనలో సినిమా పట్ల ఆసక్తిని ప్రేరేపించింది. కొన్ని సినిమాలకు తనతో రెండవ సారి కూడా తీసుకెళ్లేవారు రే. ప్రముఖ ఆర్థికవేత్త మహల్నోబిస్‌కు సహాయకుడుగా పని చేస్తుండగా చిదానంద దా 1946లో పరిచయ్ పత్రికలో ప్రముఖ రచయిత బుద్ధదేవ్ బోస్ రాసిన వ్యాసానికి పదునైన సమాధానం రాశాడు. అది అందరి దృష్టిలో పడింది. ఆ పత్రిక సంపాదకులు ఆయనను తమకు భవిష్యత్తులో కూడా రాస్తూ వుండవలసిందిగా కోరారు. ఆ తర్వాతి ఏడాది సత్యజిత్ రే, మహల్నోబిస్‌తో కలసి చిదానంద కొల్‌కతాలో తొలి ఫిలిం సొసైటీ ఏర్పాటు చేశాడు. చలన చిత్ర కళను కొత్త మలుపు తిప్పిన సెర్జీ ఐజెన్ స్టిన్ చిత్రం బ్యాటిల్‌షిప్ పొటాంకిన్ తొలి ప్రదర్శనగా వేశారు. అంతకు ముందు ముంబాయిలో 1937లో ఒకటి,1942లో ఒకటి ఇలాటి సొసైటీలు ఏర్పడినా ఉద్యమ రూపం తీసుకుంది మాత్రం కొల్‌కత్తా సొసైటీ స్థాపన తర్వాతే. 1957లో అఖిల భారత సొసైటీ ఏర్పడింది. ఆయన స్వయంగా 'బిల్లెట్ ఫెరట్, ఆమోదిని' అన్న రెండు చిత్రాలు తీశారు. ఇవేగాకుండా విభిన్న దర్శకుల జీవితాలపై ఆయన తీసిన డాక్యుమెంటరీలు విమర్శకులను విపరీతంగా ఆకర్షించాయి. మృణాళ్‌సేన్‌పై పరిశోధన చేస్తుండగా ఇందుకు సంబంధించిన ప్రతిపాదన వచ్చింది. ఆయన ఎగిరి గంతేసి ఒప్పుకున్నారు. సత్యజిత్ రే, రుత్విక్ ఘటక్‌ల కంటే మృణాల్ సేన్ చేసిన సేవ తక్కువ కాదని అయితే దానికి సరైన గుర్తింపు రాలేదని ఆయన అభిప్రాయం. అనేక అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలకు న్యాయ నిర్ణేతగానూ అతిథిగానూ హాజరవడం ఆయన పరిశీలనా శక్తికి పదును పెట్టింది.

చిదానంద జీవితాంతం అనేక ప్రముఖ పత్రికలలో చిత్ర సమీక్షలు, విశ్లేషణలు రాస్తూ వచ్చారు. సమాంతర దృష్టిని చైతన్యాన్ని పెంచడానికి కారకులయ్యారు. దీనికి కారణం సినిమాను కేవలం కాలక్షేపంగా గాక నిశిత దృష్టితో చూడటమే. వాణిజ్య చిత్రాల వరవడిలోనే కొట్టుకుపోకుండా ప్రత్యామ్నాయ ప్రయత్నాలను హర్షించాలని ఆయన కంకణం కట్టుకున్నారు. సిద్ధాంత నిబద్ధత లేని విమర్శకుల వల్ల విమర్శ పలచబారుతున్నదనే చిదానంద కనీసం సౌందర్య దృష్టి కూడా లోపించడాన్ని అసలే జీర్ణించుకోలేరు. టాకింగ్ ఎబౌట్ ఫిలింస్, సినిమా ఆఫ్ సత్యజిత్ రే, ద పైంటెడ్ ఫేస్- స్టడీస్ ఇన్ ఇండియన్ సినిమా అన్నవి ఆయన రాసిన గ్రంథాలు. ఇవన్నీ బాగా అదరణ పొందినవే. ఇప్పుడిప్పుడే సినిమాలపై సాహిత్యం పెరగడం, కొన్ని మంచి పుస్తకాలు రావడం పట్ల ఆనందం వెలిబుచ్చుతారు. తన అనుభవాన్ని ఆయన ఇలా వివరించారు: 'నేను సినిమాలను సమగ్ర దృష్టితో చూస్తాను. నవ ప్రయోక్తలను వారి చిత్రాలను సాంఘిక చారిత్రిక రాజకీయ నేపథ్యంలో చూపించే ప్రయత్నం చేస్తాను. నాకు ప్రపంచమంతా పర్యటించే అవకాశం కలిగింది. దేశ దేశాల చలన చిత్ర కళాకారులను కలుసుకోగలిగాను. నేను కేవలం భారతీయ సినిమా గురించే రాసినా నా పుస్తకాలు మాత్రం చాలా విశాల ప్రాతిపదికపై రూపొందుతాయి. సినిమా రంగంపై పుస్తకాలు రూపొందించాను. సంపాదకుడుగా వ్యవహరించాను. అపర్ణా సేన్ సంపాదకత్వంలో వెలువడే సనంద అనే పక్ష పత్రికలో సినిమా కాలమ్ రాస్తుంటాను" అని ఆయన చెప్పుకున్నారు. అన్నట్టు ప్రముఖ నటి దర్శకురాలు అయిన అపర్ణా సేన్ ఆయన కూతురే! కొంకణాసేన్ ఆయన మనవరాలు.

మహిళా సమస్యలపై అపర్ణాసేన్ తీసిన చిత్రాలు అంతర్జాతీయంగా పేరు తెచ్చుకున్నాయి. అయితే ఆమెలో కళాభిరుచి కలిగించడంలోనూ చిదానంద ప్రధాన పాత్ర వహించారు. ఈ విషయం ఆమె పలు సార్లు చెప్పారు. 'ద రివర్' అనే చిత్రం తీసేందుకోసం రెనియర్ భారత దేశం వచ్చినపుడు నేను బాగా పసి వయస్సులో వున్నాను. నేను కాస్త పెద్దదాన్నయిన తర్వాత మా నాన్న నాకు ఫిలిం సొసైటీ ఉద్యమంలో సముచిత పాత్ర కల్పించాలని ఎంతగానో తపన పడే వారు. అర్థవంతమైన సినిమా తయారు కావాలన్నదే ఆయన ఏకైక కాంక్షగా వుండేది. తర్వాతి కాలంలో మంచి దర్శకులుగా రచయితలుగా తయారైన చాలమందిని నేను బాల్యంలోనే చూశాను. వారంతా నాకు ఇంటి దగ్గరే కనిపించేవారు. సొసైటీ నిర్వహించే ప్రదర్శనలన్నిటికి మేము వెళ్లేవాళ్లం. ఈ విధంగానే నాలో మంచి సినిమా గురించి ఒక అభిప్రాయం ఏర్పడింది. ఈ రోజుకు కూడా దృశ్యం బాగుంటే తప్ప ఒక సినిమా నాకు నచ్చదు. కేవలం కథను బట్టి సంతోషించలేను. మా నాన్న ఎలాటి వాడంటే బెంగాలీ అగ్ర తారలైన సుచిత్రా సేన్ ఉత్తమ్ కుమార్ నటించిన సాగరిక హరానో సుర్ వంటి పాపులర్ చిత్రాలకు వెళ్లనిచ్చేవారు కాదు. అవసలు సినిమాలే కాదని తోసిపుచ్చేవారు." అని ఆమె చెబుతారు.ఈ కారణంగానే తర్వాతి రోజుల్లో ఆమె మంచి సమస్యాత్మక చిత్రాలు తీయగలిగారని భావించవచ్చు.

మొత్తంపైన మంచి సినిమాలే జీవితంగా గడిపిన చిదానంద తను అనుకున్న మార్గంలోనే నడవడమే గాక దానికి గౌరవం కూడా సంపాదించి పెట్టారు.చాలా ఏళ్ల కిందటే విమర్శకుడుగా ఆయనకు జాతీయ పురస్కారం లభించింది. 2004లో ఓసియాన్ చలన చిత్రోత్సవంలో ఇందుకు సంబంధించిన జీవిత సాఫల్య పురస్కారం దక్కింది. ఈ అవార్డు తెచ్చుకున్న తొలి భారతీయుడు ఆయనే. రవీంద్రుని శాంతి నికేతన్‌లో చాలా కాలం నివసించిన చిదానంద ఆర్థ్రైటిస్ వ్యాధితో బాధపడ్డారు.అయితే అంత అనారోగ్యంలోనూ పర్యటనలు, కళారాధన మానలేదు. ఉత్తమ చిత్రాలను ఆదరించడం, అధ్యయనం చేయడమే ఆయనకు ఇవ్వగల నివాళి.

- పీపీ

చిన్నకథ

సదా మీ సేవలో...



'సదా మీ సేవలో' రజతోత్సవ సభ ఏర్పాట్లలో సదా నిమగ్నమై ఉంది. స్టేజి అలంకరణ, అతిథుల ఆహ్వానం, దంపతులకు సమాచారం అందివ్వడం... తదితర ఏర్పాట్లన్నీ సిబ్బందే చూస్తున్నా ఒకటే టెన్షన్.. ఈ ప్రోగ్రాం నిర్వహించడమే సదాకు ఒక కలగా ఉంది. తానేంటి ఎంతోమంది దంపతుల కాపురాలు నిలబెట్టడమేంటి? అని తలచుకుంటేనే ఆశ్చర్యం. ఇప్పటికీ అనేక మంది నుండి తనకు ఫోన్లు, ఉత్తరాలు వస్తూనే ఉంటాయి. వారి ఇళ్లల్లో ఎటువంటి చిన్న ఫంక్షన్ జరిగినా ఆహ్వానం తప్పనిసరి. తాను ఈ సంస్థను ప్రారంభించడమే ఒక కల. తన స్నేహితురాలి జీవితానుభవమే ఈ సంస్థ ప్రారంభానికి స్ఫూర్తి. ఒక్కసారి స్నేహితురాలు అరుణ జీవితం కళ్లముందు సినిమా రీలులా తిరిగింది.

అరుణ పదహారేళ్ల ప్రాయంలోనే ప్రేమలో పడింది. డిగ్రీ చేస్తున్న రాజు పక్కింట్లోనే ఉండేవాడు. ఇంటినుంచి వెళ్లేటపుడు ఇద్దరూ విడివిడిగా వెళ్లినా కొంత దూరం వెళ్లేసరికి ఇద్దరి సైకిళ్లు పక్కపక్కనే ఉండేవి. ఒకటి రెండు సంవత్సరాలు కాదు, వీరి ప్రేమాయణం దాదాపు ఐదేళ్లు సాగింది. అరుణ డిగ్రీ అయిపోయింది. రాజు ఎంబిఏ చేసి సొంతగా వ్యాపారం ప్రారంభించాడు. మొగ్గలా ఉన్న వీరి ప్రేమ ఐదేళ్లలో పూలుపూసి విప్పారిందే తప్ప వాడిపోలేదు. ఇద్దరివీ వేర్వేరు కులాలు కావడంతో వీరి పెళ్లిని పెద్దలు అంగీకరించలేదు. తల్లిదండ్రులను, బంధువులను ఎదిరించి ఒక్కటయ్యారు.

వీరి కాపురం ఎంతో అన్యోన్యంగా 15ఏళ్లపాటు సాగింది. వీరి కలల పంటగా ఓ పాప, బాబు. ఇద్దరూ ముచ్చటగా ఉండేవారు. పోటీ పడి తరగతుల్లో ఫస్టు వచ్చేవారు. పిల్లలు పెద్దవడంతో బాధ్యతలూ పెరిగాయి. ప్రస్తుతం ఉన్న కార్పొరేట్ చదువుల స్థాయిలో తన బిడ్డలను చదివించాలంటే వ్యాపారాన్ని విస్తరించాలనుకున్నాడు రాజు. అప్పటివరకు ఉన్న ఊళ్లోనే ఉదయం పది గంటలకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చేవాడు. మళ్లీ సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లి రాత్రి 8 గంటలకల్లా వచ్చేసేవాడు. స్నేహితులతో ప్రత్యేకించి గడిపేవాడు కాదు. ఎవరైనా అతనితో మాట్లాడాలంటే బిజినెస్ సమయంలోనే షాపులో కలిసేవారు. బిడ్డల చదువుల కోసం వ్యాపారాన్ని విస్తరించే నేపథ్యంలో, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తన సేల్స్ ప్రారంభించాడు. కష్టానికి తగిన ఫలితం దక్కింది. లక్షాధికారిగా ఉన్న రాజు కోటీశ్వరుడయ్యాడు. బెంజి కారు కొన్నాడు. పెద్ద భవంతి కట్టించాడు.

అయితే వ్యాపార విస్తరణలో భాగంగా రాజుకు కొన్ని అవలక్షణాలూ వచ్చాయి. అపుడపుడూ తాగి ఇంటికొచ్చేవాడు. అరుణలో ఏదో భయం మొదలయ్యింది. రాజు తనకు దక్కకుండా పోతాడేమోననే అభద్రతాభావం. ఈడొచ్చిన పిల్లల ముందు తండ్రి ఇలా తాగి వస్తే వారిపై ప్రభావం ఎలా ఉంటుందోననే ఆందోళన. ఇన్నాళ్లూ చిలకా గోరింకల్లా ఉన్న తమ కాపురంలో తాగుడు వ్యసనం చిచ్చు రేపుతోందనే ఆవేదన. ఎన్నోసార్లు తాగవద్దని ప్రాధేయపడింది. చెడు స్నేహాలు చేయవద్దని వేడుకుంది. ఆమె మాటలకు రాజుకు కోపం వచ్చేది. తన స్నేహితులను చెడ్డవారంటుందా? అనే అహం బయల్దేరింది. తన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందంటే స్నేహితులు పెట్టిన పెట్టుబడులే కారణమన్నది రాజు వాదన. అయితే తన కాపురం కూలిపోడానికీ ఆ స్నేహితులే కారణమని అరుణ ప్రతివాదన. ప్రతిరోజూ ఒకరికొకరు సాధింపులు, వేధింపులు. రాజు బయటికి వెళ్తుంటే 'ఎక్కడికి?' అని భార్య అడగడంతోనే కోపం వచ్చేది. అంటే నన్నే అనుమానిస్తుందా? అని వితండంగా సమాధానమిచ్చేవాడు. వీరి గొడవల మధ్య పిల్లలు నలిగిపోయేవారు. ఐదేళ్ల పాటు వీరి కాపురం ఒకరినొకరు 'టార్చర్' పెట్టుకోవడంతోనే సాగింది. తన భార్య తనను అర్థం చేసుకోవడం లేదని, తన వేధింపులు భరించలేకపోతున్నానని రాజు వాదన. తన భర్త హింస భయంకరంగా ఉందని, గతంకంటే ప్రేమ తగ్గిందని అరుణ... వీరి కోపాన్నంతా పిల్లలపై చూపేవారు. ఇద్దరి గొడవలకు పిల్లలు బలయ్యేవారు.

ఇన్నాళ్లు అరుణ, రాజు కాపురాన్ని చూసి చుట్టుపక్కలవారి కన్ను కుట్టేది. ప్రస్తుతం వీరి మధ్య గొడవ వారికి హాట్ టాపిక్ అయ్యింది. స్నేహితుల దగ్గర మధ్యస్తాలు జరిగినా ఎవరూ వినని పరిస్థితి. నాది కరెక్టంటే, నాది కరెక్టు అంటూ ఎవరికి వారే ఇగో చూపించేవారు. ఎవరూ తమది తప్పని ఒప్పుకునే పరిస్థితి లేదు. తనను ఊరంతా ఆరేసిందని భార్యపై మరింత కోపం పెరిగింది. ఎడ్డెమంటే తెడ్డెం అనేలా ఇద్దరి జీవితాలు ఉండేవి. ఒకరి మాటంటే మరొకరికి పొసగేది కాదు. విడిపోతే గాని మనశ్శాంతి ఉండదనే అభిప్రాయానికి వచ్చేశారు ఇద్దరూ. అయితే పిల్లల కోసమే కలిసుంటున్నారు. కూతురు ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలోకి వచ్చింది. భార్యాభర్తల పోట్లాటల మధ్య నలిగిపోయిన కూతురు విమల తనతో చదువుతున్న సందీప్‌కు దగ్గరయ్యింది. అతనితో ఎక్కడికంటే అక్కడకు వెళ్లడమే ప్రేమ అని భ్రమించింది. కొన్నాళ్లు విమలతో స్నేహంగా తిరిగిన సందీప్ ఆరు నెలలకే వదిలించుకునే ప్రయత్నం చేశాడు. అతనికి లేని అవలక్షణం లేదు. తాగుడే కాదు, అమ్మాయిల పిచ్చి ఉంది. ఇంజనీరింగ్ చదవడం ఓ హాబీ మాత్రమే. తాను మోసపోయానని తెలుసుకున్న విమల నిద్రమాత్రలు మింగింది. వెంటనే ఆస్పత్రిలో చేర్పడంతో ప్రాణాలతో బయట పడింది. కొడుకు అమర్ తండ్రికి తగ్గ కొడుకులా తయారయ్యాడు. అడిగితే 'నువ్వు తాగట్లేదా' అని రెట్టించేవాడు.

వీరి కాపురాన్ని దగ్గరగా పరిశీలిస్తున్న అరుణ స్నేహితురాలు 'సదా' విలవిలలాడి పోయేది. చిన్న చిన్న కారణాలతో ఇగోలకు పోయి ఇద్దరూ కాపురాన్ని నరకంగా మార్చుకుంటున్నారని సదా ఎంత చెప్పినా పట్టించుకోలేదు. కూతురు, కొడుకు ప్రవర్తనతో విసిగిపోయిన అరుణ, రాజు ఒక్కసారిగా ఆలోచనలో పడ్డారు. గతంలో అనేకసార్లు ప్రేమతో 'సాధించు' అంటే తలకెక్కించుకునేవారు కాదు. ఇన్నేళ్ల తమ జీవితంలో ఒకరికొకరు తోడుగా ఉండి బాధ్యతగా వ్యవహరించాల్సిన వయస్సులో ఇగోలకు పోయినందుకు మదనపడ్డారు. సదా సూచన మేరకు మరోసారి తమ తొలిరోజుల్లో ప్రేమను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరిని విడిచి మరొకరు ఉండలేకపోయిన విషయాలను మననం చేసుకున్నారు. పదేపదే సదా ఇచ్చిన కౌన్సిలింగ్‌తో అరుణకు జ్ఞానోదయమయ్యింది. ప్రేమతో 'సాధించు' అనే సూచన పాటించకుండా అహంభావంతో ఏడ్చి, గొడవపడి ఇంటిని నరకప్రాయం చేసుకున్నానని అర్థమయ్యేసరికి కొంత జీవితం దాటిపోయింది. స్నేహితుల నుండి అవలక్షణాలను సొంతం చేసుకున్న రాజులో పశ్చాత్తాపం మొదలయ్యింది. తన బిడ్డల భవిష్యత్ కోసం మళ్లీ వారి జీవితంలో 'వసంతం' చిగురించింది. ప్రేమతో భార్యాభర్తలు దగ్గరవడమే కాదు, బిడ్డల బంగారు భవిష్యత్‌కోసం ఇద్దరూ తపించారు. దీన్నే తన తొలి విజయంగా 'సదా' భావించింది. ఓ రకంగా అరుణ ఇచ్చిన ప్రోత్సాహంతోనే 'సదా మీ సేవలో' అనే కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభించింది. దీనికి 'ట్యాగ్' కూడా ఉందండోయ్.. అదే 'ప్రేమతో సాధించు'. ప్రస్తుతం అరుణ ఇందులో 'పార్టనర్' కూడా.

- అవనిగడ్డ వనజ

కవిత్వమ్

రైతు సావడు

విను
సెప్తాను
కథ కాదు
కదిలించే
వ్యథ
రైతు
సచ్చిపోయాడు!

మట్టిబువ్వ
పిసికిన చేతులు
దిక్కులకు
బరువు

కొడవల్లా
వంగే నడుము
కదలని
మెదలని
బండ
ఉడుపుల బురదలో
నాట్యమాడిన
కాళ్లు
కొండులూడిన
నాగతేళ్లు

సేద్యం
సేసిన
సెమట సుక్క
నోట్లో కసెక్కిన
ఉప్పగడ్డ

గుంజుతున్న
నరాలు
కట్టు తెగిన
పూనిచెర్వు

రత్తం
సారం లేని గంజి
నాగేటి చాలులో
కొత్తనీరు
పారతంది
అది
కన్నీరు!

మడిసెక్కన
పిచ్చిమొక్కలు
మొలకెత్తేయి
అవి
దగాకోరుల
కొమ్ములు!
బండి
చక్రం
అంగ
వికలమయ్యాయి
ఎడ్ల మూపురం
పూజలు పూయక
పౌరుషం
ఒగ్గేసింది

నాగలి
అట్నుంచిటు
తిరగబడి
జవాబులేని
ప్రశ్నైంది
పనిలేనిది...
ప్రశ్నించే
హక్కెక్కడిది?!

బొరుగు
మిన్నకుండి
ఆశ్చర్యార్థకమైంది
పసరిక
అదృష్టం
ఇగిరిపోయింది!

గొడ్డలి
ఒడ్డున పడుంది
నిలువునా
చేరేసుకుంటుంది

ఐనా
కృషీవలుడు
కదల్లేదు!

పంటకి
పహారా కాసిన
దిష్టిబొమ్మలు
చీలికలు
పేలికలయ్యాయి
పేగులు
తన్నుకొని
బయటకొచ్చాయి

ఆత్మబంధువుల
ఆవేదనకు
నేల
కన్నెర్ర జేసింది
అమ్మ
ఆగ్రహించింది

ఆపక్క
ఆకాశం
ఎరుపెక్కింది...
అది
మట్టికి ప్రతిబింబం
మేఘం కరిగింది
ఒక బొట్టు
నీటిచుక్క రాల్చింది
ఆ సరసాల
అగ్నిగుండం
సల్లబడింది

ఆయుధాలు
మాత్రం
వేడెక్కే వున్నాయి
విప్లవాన్ని
రాజేసేయి
అన్నీ
మూకుమ్మడిగా
ఎదురెల్లేయి
దెబ్బకు
"కుట్రదారుడు"
పరారయ్యాడు

రైతు ఇల్లాలి
ఎడమకన్ను
అదిరింది

ఏరు,
ముత్తైదువ
ఎదురొచ్చేయి

వరిదుబ్బుల
మూలాలు కూడా
ప్రాణం
పోసుకున్నాయి

పొలం
కళకళలాడింది!
రమ్మనండి
ఎవడన్నాడు
రైతు
సచ్చిపోయాడని??

(గంటేడ
గౌరునాయుడు
గారి దీర్ఘ కవిత
"నాగలి"కి ఈ నా
కవిత అంకితం)

- ఎస్. బాల సుధాకర్ మౌళి

హైకూలు

కంటి వెలుగు
దరహాస చంద్రిక
వెండి పులుగు

అమ్మ కనులు
సంధ్యారాగ సంధాన
ప్రకాశనాలు

నింగిలో పక్షి
మనసుకి రెక్కలా
చిందే పాటలా

తెల్ల పావురం
లా ధవళంపు నాకం
నిర్మల హాసం

చిందులు లేని
అడుగు బంధాలకు
జంట తోడుగు

- కాశీవఝుల
రమానరసింహం

గజల్

అహమంతా కరిగితె జ్ఞానం- వరిస్తుంది అంటాను
మంచి కార్యములనే హృదయం -తలుస్తుంది అంటాను
అమృతమే అందిన కూడా -అత్యాశే తొలుగునా
తృప్తితోడ నిండిన మనసే -మురుస్తుంది అంటాను
అంగట్లో దొరికే వస్తువు -కాదు కదా ప్రణయం
స్పందించిన మనసే ప్రేమలు -కురుస్తుంది అంటాను
ముసలితనం దరికి చేరినా -వలపులన్నీ వాడినా
చిలిపి బాల్య స్మృతియే మదిలో- నిలుస్తుంది అంటాను
రాజకీయ రంకుల పదవికి -ఎందుకోయి ఈ తపన
సేవతోడ కీర్తికిరీటం -మెరుస్తుంది అంటాను
శ్రమించుటే మన తలరాతను -మార్చివేయు నేస్తమా!
స్వయంకృషి పూలబాటను -పరుస్తుంది అంటాను
వాడినట్టి భావం రాలితే -మనసుకది ఊరటే
కొత్త చిగురు తొడిగి కవిత్వం -జనిస్తుంది అంటాను
ఉన్నదంత నాదే అంటే -వివాదమే నరేంద్రా!
త్యాగాలకు నిలిచిన జన్మే తరిస్తుంది అంటాను

- ద్యావరి నరేందర్ రెడ్డి

నవ్వుల్ - పువ్వుల్

చెప్పకు

నర్స్: సార్! శుభవార్త. మీకు బాబు పుట్టాడు!
వ్యక్తి: ఓ...చాలా సంతోషం! కానీ ఒక్క మాట!
నర్స్: ఏంటార్?
వ్యక్తి: ఈ విషయం మా ఆవిడకు చెప్పకండి. ఆవిడకు మొదట నేనే చెప్పి సర్‌ప్రైజ్ చేస్తాను!

సిన్మా పిచ్చి

గోపాలం : అదేంటి ఎండలేదు, వానలేదు! చంకన గొడుగు ఎందుకు తెచ్చుకున్నారు?
గోవింద్ : సిన్మా టికెట్‌కి డబ్బులు తక్కువయ్యాయి. పాన్ షాపులో తాకట్టు పెడదామని.

జె. సుధాకర్ పట్నాయక్,
కాకినాడ.

అదే కావాలి



కస్టమర్: ఏంటి ఆ కోడికి కాలు లేదు?
సర్వర్: కోళ్ల పందెంలో కాలు పోయిందండీ.
కస్టమర్: ఓకే! అయితే నాకు గెలుపొందిన కోడి కావాలి. పట్రా!

నిద్ర

టీచర్: ఒరే టింకూ! క్లాసులో నిద్రపోకూడదని నీకు తెలీదా?
టింకు: తెలుసు టీచర్. మీరు కొంచెం ఆ పాఠం చెప్పడం ఆపితే మరింత హాయిగా నిద్రపోతాను.

తడవలా?



రాజ్: రామ్! నేనో ప్రశ్న అడుగుతా. సమాధానం చెప్పు!
రామ్: ఆ... అడుగు.
రాజ్: ఐదుగురు అబ్బాయిలు ఒకే గొడుగులో వెళుతున్నారు. కానీ ఒక్కరు కూడా తడవలా? ఎలా సాధ్యం?
రామ్: (బాగా ఆలోచించి) తెలీట్లేదే.
రాజ్: ఎందుకంటే అప్పుడు వర్షం కురవలేదు కాబట్టి.

మంచిదా? చెత్తదా?

అంకిత్: ఓ పెన్ను ఇవ్వండి!
షాపతను: మంచిది కావాలా? చెత్తది కావాలా?
అంకిత్: మీ దగ్గరున్న పెన్నులన్నిట్లోకి చెత్త పెన్ను ఇవ్వండి. ఎందుకంటే నేనో వెధవ సన్నాసికి ఉత్తరం రాయబోతున్నా.

కోటీశ్వరుడు

బద్ధకిస్టు: నేను కావాలనుకుంటే కోటీశ్వరుణ్ణి అవ్వగలను తెల్సా?
వాడి నేస్తం: మరి కావచ్చు కదరా!
బద్ధకిస్టు: ఆ...ఆ టాక్సు కట్టారని కట్టలేదని తలనొప్పులు మనకెందుకు చెప్పు? అందుకే వద్దనుకున్నా!

క్యారెట్టులా...



పిల్లవాడు: నాన్నా! అడవిలో కుందేలును ఒక్కటంటే ఒక్క నిముషంలో పట్టుకోవడం ఎలా?
వేటగాడు: ఏదైనా చెట్టు పొద వెనకకెళ్లి...క్యారెట్టు తినేటప్పుడు వచ్చే శబ్దం చేస్తే చాలు.

నిద్రలో నడక

పంకజ్: డాక్టర్! నాకు నిద్రలో నడిచే అలవాటుంది. దాన్ని వదిలించుకోవాలంటే ఎలా?
డాక్టర్: ఏముంది నిద్రపోబోయే ముందు నీ మంచం చుట్టూ గోలీకాయలు చల్లుకొని నిద్రపో.
పంకజ్: ఆ... అప్పుడు నాకా అలవాటు పోతుందా?
డాక్టర్: తప్పకుండా పోతుందయ్యా. ఎలాగంటే నువ్వు మంచం దిగి గోలీల మీద కాలు వేయగానే జారిపోతుందిగా.

రాలిపోవడం

రామన్న: నాకు వెంట్రుకలు తెగ రాలిపోతున్నాయి. ఏం చేయమంటారు?
సోమన్న: పోపోవయ్యా. నాకు పళ్లు రాలుతున్నాయి. వాటిని ఏం చేసుకోవాలో నాకు తెలియట్లేదు.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:
స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

ఏడు దశాబ్దాల హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్

చలనచిత్ర వాణిజ్యానికి సంబంధించి, హైదరాబాద్‌లో ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటు ఓ పెద్ద చారిత్రక ఘటన. ఇప్పటికి సరిగ్గా 70 ఏళ్ళ క్రితం ఆ సంఘటన జరిగింది. ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని, ఎదిగింది. ఏడో దశాబ్దంలోకి గడచిన ఏడు పదుల ఏళ్ళుగా 'హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' చేసిన సేవ, అసలు ఈ సంస్థ ఏర్పడడానికి కారణమైన పరిస్థితులు, అప్పటి ప్రభావాలు వగైరా చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

సినిమా కబుర్లు
FILM CHAMBER OF COMMERCE
ESTD. 1941
GEGD No. 01/17th NOV 1941
SECUNDERABAD - 500 003.

అప్పటికి హైదరాబాద్ ప్రాంతం ప్రత్యేక సంస్థానంగా, నిజామ్ ప్రభువు ఏలుబడిలో ఉంది. భారతదేశానికి కూడా స్వాతంత్ర్యం రాలేదు. 1931లో భారతీయ టాకీలు మొదలైన తరువాత, కొన్నేళ్ళకు వివిధ హిందీ, తెలుగు టాకీలు హైదరాబాద్ సంస్థాన ప్రాంతంలో విరివిగా రాసాగాయి. ఆ పరిస్థితుల్లో 1941లో నిజామ్ ప్రభువు ఓ శాసనం చేశాడు. హైదరాబాద్ సంస్థాన ప్రాంతంలోకి దిగుమతి అవుతున్న చలనచిత్రాలపై నిజామ్ ప్రభుత్వం కస్టమ్స్ సుంకం విధించింది. ఆ మేరకు కఠినమైన శాసనాన్ని ప్రవేశపెట్టింది. చిత్రాల పంపిణీ హక్కుల నిమిత్తం పంపిణీదారులు చెల్లించిన మొత్తాన్ని లెక్కలోకి తీసుకొని, దానిలో 5 శాతం వంతున సుంకం విధించాలన్నది ఆ శాసనం ప్రధాన ఉద్దేశం. ఆ చట్టం అమలైతే, ఇక చలనచిత్ర వాణిజ్యం పూర్తిగా నాశనమయ్యే ప్రమాదం ఉందని చలనచిత్ర పంపిణీదారులు గుర్తించారు. ఆ చట్టం తమకు కూడా ఎంతో హానికరమని చలనచిత్ర ప్రదర్శకులు ఆందోళన చెందారు.

హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఏర్పాటు కథ

సరిగ్గా అలాంటి పరిస్థితుల్లో, ఇవాల్టికి సరిగ్గా 70 ఏళ్ళ క్రితం 1941 మే 22న హైదరాబాద్ సంస్థానంలోని చలనచిత్ర పంపిణీదారులు, ప్రదర్శకులు ఇష్టాగోష్ఠిగా సమావేశమయ్యారు. ఆ సమాలోచనల తరువాత మే 24న 'ఇందర్ టాకీస్' (సికింద్రాబాద్‌లోని ఈ హాలు ఆ తరువాత 'అలంకార్ టాకీస్'గా పేరు మార్చుకొంది)లో హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు అత్యవసర సమావేశం జరిపారు. సరిగ్గా అదే సమయంలో దక్షిణ భారతదేశంలోని ప్రముఖ దర్శక – నిర్మాత హెచ్.ఎం. రెడ్డి ఇక్కడే ఉన్నారు. దాంతో, ఆ సమావేశానికి అధ్యక్షత వహించాల్సిందిగా కోరారు. హెచ్.ఎం. రెడ్డి అప్పటికే 'దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్యమండలి' (సౌతిండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్)కు ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. జంట నగరాల పంపిణీదారులు, ప్రదర్శకుల అత్యవసర సమావేశానికి హాజరైన ఆయన, అసమంజసమైన చట్టానికి వ్యతిరేకంగా, అందరూ ఏకమై, నిరసన తెలియజేయాల్సిందిగా సలహా ఇచ్చారు. సభ్యులందకూ ఒక్క తాటి మీదకు వచ్చి, సంఘటితంగా కృషి చేస్తే కానీ ఈ రంగం అభివృద్ధి చెందదని ఆయన దృఢమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. అలా హైదరాబాద్ సంస్థానంలో చలనచిత్ర వాణిజ్య మండలికి పునాది పడింది. ఆ పైన ఏర్పాటైన వాణిజ్య మండలికి 'హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' అని పేరు పెట్టారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ

హైదరాబాద్ సంస్థానంలో చలన చిత్రాల దిగుమతిపై విధించిన కస్టమ్స్ సుంకం సమస్యను పరిష్కరించడంలో ఈ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజయం సాధించింది. చలన చిత్రాల పొడవును బట్టి సుంకాన్ని లెక్కబెట్టే విధంగా శాసనాన్ని సవరింపజేసింది. అప్పట్లో హైదరాబాద్ సంస్థానంలో సినిమాల సెన్సారింగ్ అధికారుల ఇష్టానుసారం జరిగేది. అలాగే, 'నిజామ్ స్టేట్ రైల్వే'లో చలనచిత్రాల పార్సిళ్ళపై అపరిమితమైన ఛార్జీలు వసూలు చేసేవారు. ఇలాంటి అనేక సమస్యల మీద హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ తరచూ దృష్టి సారించింది. వాటి పరిష్కారానికి కృషి చేసింది. ఆ రోజుల్లో సంస్థ అవిశ్రాంతంగా కృషి చేయడం వల్లే 'రోటీ', 'అప్నా ఘర్', 'హిందుస్థాన్ హమారా', 'సంఘం', 'ఉల్టీ గంగా' లాంటి చిత్రాలు హైదరాబాద్ సంస్థాన ప్రాంతంలో విడుదలవడం సాధ్యమైంది. 1943లో 'హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' అధ్యక్ష స్థానం నుంచి రాజా ఇంద్రమల్‌జీ పదవీ విరమణ చేశారు. సంస్థకు పేరు, పలుకుబడి, కార్యసాధన సమకూరాలంటే, చలనచిత్ర వాణిజ్యంతో సంబంధం లేనప్పటికీ, సమాజంలో ప్రముఖ వ్యక్తులను సైతం అధ్యక్షులుగా ఆహ్వానించాలని తరువాతి రోజుల్లో నిర్ణయం తీసుకున్నారు. ఛాంబర్ చరిత్రలో ఇది ఓ ముఖ్యమైన పరిణామం. దాంతో, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడైన రావుసాహెబ్ ఏ.జె. వీరాస్వామి (ఎం.బి.ఇ) హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌కు అధ్యక్షులయ్యారు. ఆ పైన అప్పటి ప్రముఖ కార్మిక నాయకుడు బి.ఎస్. మహదేవ్ సింగ్, సరోజినీ నాయుడు కుమారుడైన డాక్టర్ ఎన్.ఎం. జయసూర్య మొదలైన ప్రముఖులు అధ్యక్షత వహించారు. ఫిల్మ్ ఛాంబర్, చిత్ర పరిశ్రమ ఎదుర్కొన్న పలు సమస్యలను పరిష్కరించడంలో తోడ్పడ్డారు.

చలనచిత్ర పరిశ్రమ మహాసభ

అలాగే, సినిమా పరిశ్రమ పట్ల ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పరచడం కోసం మండలి కృషి చేసింది. ప్రజలతో సత్సంబంధాలను పెట్టుకుంటూ వచ్చింది. ఆ కృషిలో భాగంగా ఫిల్మ్ వారోత్సవాల సందర్భంగా 1944 జూన్ 29న 'చలనచిత్ర పరిశ్రమ మహాసభ'ను ఏర్పాటు చేసింది. అప్పటి నిజామ్ ప్రభుత్వ రాజకీయ కార్యదర్శి నవాబ్ మెయిన్ నవాజ్ జంగ్ బహద్దూర్ ఆ మహాసభను ప్రారంభించారు. ఆ తరువాత ప్రజల్లో అవగాహనను పెంపొందించడానికి హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సంవత్సరాల పాటు వక్తృత్వంలో, వ్యాసరచనలో పోటీలు నిర్వహించింది. ఫిల్మ్

బ్యాలెట్‌లు నడిపింది. ప్రముఖ నట – గాయకుడు స్వర్గీయ సైగల్ స్మృత్యర్థం సంగీత కార్యక్రమాలు నిర్వహించింది.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1948 నవంబర్‌లో హైదరాబాద్ సంస్థానం, ఇండియన్ యూనియన్‌లో విలీనమైంది. దాంతో, హైదరాబాద్ సంస్థానంలోని స్థానిక సెన్సార్ విధానం, కస్టమ్స్ నిర్బంధాల లాంటి ఇబ్బందులు తొలగిపోయాయి. అయితే, కొత్త సమస్యలు వచ్చిపడ్డాయి. అప్పట్లో ఫిల్ములను పేలుడు పదార్థాలుగా పరిగణించేవారు. కాబట్టి, నగరం బయట ప్రత్యేకమైన గిడ్డంగుల్లో వాటిని భద్రపరచాల్సి వచ్చేది. అందు కోసం ఎంతో వ్యయప్రయాసలతో ఏర్పాట్లు చేశారు. తీరా ఆ తరువాత వచ్చిన సాంకేతిక పరిణామాల వల్ల సురక్షితమైన ఫిల్ములు రావడంతో ఆ ఏర్పాట్లన్నీ నిరుపయోగంగా మారాయి. ఇలాంటి ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొంటూనే, సినీ పరిశ్రమ ప్రయోజనాల గురించి ఎప్పటికప్పుడు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో ఫిల్మ్ ఛాంబర్ నివేదిస్తూ వచ్చింది. 1951లోనే 'ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' ఏర్పాటైంది. అప్పుడు దాని సంస్థాపక సభ్యుల్లో ఒకరిగా హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ నిలబడింది. 1953 జూలై 30న మిగిలిన శాఖలన్నిటితో కలసి 'ఫిల్మ్ ఫెడరేషన్' దినోత్సవాన్ని నిర్వహించింది.

సిల్వర్ జూబ్లీ సందర్భంగా...

కొనసాగిన ప్రత్యేక ఉనికి, కృషి

1954లో ఫిల్మ్ ఛాంబర్‌కు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దాంతో, ఫెడరేషన్‌లో సభ్యత్వాన్ని ఛాంబర్ తాత్కాలికంగా వదులుకుంది. 1956లో భాషా ప్రయుక్తంగా 'ఆంధ్రప్రదేశ్' ఏర్పాటైంది. ఫలితంగా అప్పటిదాకా హైదరాబాద్ రాష్ట్రంలో భాగంగా ఉన్న మరాఠ్వాడా ప్రాంతం మహారాష్ట్రకు వెళ్ళింది. అలాగే, హైదరాబాద్ రాష్ట్రంలో ఉంటూ వచ్చిన కన్నడ ప్రాంతాలు కర్ణాటక రాష్ట్రంలోకి చేరాయి. అయితే, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత కూడా, సినీ వ్యాపారానికి సంబంధించినంత వరకు ఏమీ జరగనట్లే 'హైదరాబాద్ స్టేట్ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' తన కార్యకలాపాలను యథావిధిగా కొనసాగించింది. హైదరాబాద్ కేంద్రంగా తన మునుపటి నిజామ్ రాష్ట్ర ప్రాంత సినీ వాణిజ్య వ్యవహారాలను చూస్తూ వచ్చింది. దాంతో, హైదరాబాద్ కేంద్రం డిస్ట్రిబ్యూషన్ హక్కులంటే, మునుపటి హైదరాబాద్ సంస్థాన ప్రాంతమంతటికీ వర్తించేదిగానే కొనసాగింది. (ఇప్పటికీ సినిమాల పంపిణీ, కొనుగోలు వ్యాపారంలో అదే ఆనవాయితీ కొనసాగుతోంది. ఇవాళ్టికీ నైజామ్ హక్కులంటే పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో భాగమైన కర్నాటక, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రాంతాలంతటికీ వర్తించే హక్కులనే అర్థం). "అప్పట్లో నిజామ్ స్టేట్‌లో (హైదరాబాద్ సంస్థానంలో) మొత్తం 16 జిల్లాలుండేవి. తెలుగు ప్రాంతమైన తెలంగాణలో 8 జిల్లాలు (ఆ తరువాత ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలు ఏర్పడడంతో 10 జిల్లాలయ్యాయి), ఉత్తర కర్ణాటకలో 3 జిల్లాలు (గుల్బర్గా, బీదర్, రాయచూర్), మరాఠ్వాడాలో 5 జిల్లాలు (ఔరంగాబాద్, నాందేడ్, పర్భనీ, బీడ్, ఉస్మానాబాద్. ఆ తరువాత మరో రెండు జిల్లాలు లాతూరు, జాల్నా ఏర్పడడంతో, ఇప్పుడు వీటి సంఖ్య 7 జిల్లాలైంది) – ఇవన్నీ సినీ వాణిజ్యంలో నైజామ్ హక్కుల కిందకు వస్తాయి. ఇవాళ్టికీ తెలుగు, హిందీ చిత్రాల పంపిణీకి అదే పద్ధతిని అనుసరిస్తున్నాం" అని ఇప్పటి 'ది తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' అధ్యక్షుడు ఎం.విజయేందర్ రెడ్డి, గౌరవ కార్యదర్శి కె. మురళీమోహన్ చెప్పారు.

నిజానికి, ఆంధ్రప్రదేశ్ అవతరణతో 1957లో ఆంధ్రా ఛాంబర్‌ను, హైదరాబాద్ ఛాంబర్‌లో విలీనం చేయాలనే ప్రతిపాదన వచ్చింది. కానీ, అది ఆచరణ సాధ్యం కాదని భావించడంతో అడుగు ముందుకు పడలేదు. ఆ తరువాత 1960లలో హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ విలీనం కోసం సమగ్రమైన ప్రతిపాదనలు చేసి, ఆంధ్రా ఛాంబర్‌కు పంపింది. కానీ, అదీ వెంటనే తేలలేదు. నిజానికి, ఒకటే రాష్ట్రంగా ఏర్పడినా, తొలి రోజుల్లో రాష్ట్రంలోని మిగతా ప్రాంతానికీ, హైదరాబాద్ ప్రాంతానికీ అమలులో ఉన్న చట్టాల్లో తేడాలుండేవి. వాటి వల్ల సభ్యులకు ఇబ్బందులు కలగకుండా హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ కృషి చేయాల్సి వచ్చింది. అలాగే, తరచూ విద్యుత్ కోత, పబ్లిసిటీ ఏర్పాట్లపై పన్నుల పెంపు, వినోదపు పన్ను పెంపు లాంటి అనేక సమస్యలపై ఛాంబర్ పోరాటం సాగించింది. కాగా, స్థానికంగా చలనచిత్ర నిర్మాణాన్ని ప్రోత్సహించాలని 1962లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో, హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ తన వంతుగా సమగ్రమైన ప్రతిపాదనల్ని సమర్పించింది. వివిధ కమిటీల్లోని తన ప్రతినిధుల ద్వారా తగిన కృషి చేసింది.

సభ్యుల కోసం హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్ అనేక విధాల సేవలందిస్తూ వచ్చింది. ఫిలిమ్ వాణిజ్యానికి చెందినవారి మధ్య ఏర్పడే వివాదాల పరిష్కారం కోసం సంప్రదింపుల సంఘాన్ని ఏర్పాటు చేసింది. 1958 నుంచి ఏటా 'ఫిలిమ్ డైరీ'ని ప్రచురించింది. ఆ డైరీ ప్రచురణ ఇప్పటికీ కొనసాగుతోంది. అలాగే, సినీ పరిశ్రమ సమస్యలనూ, సమాచారాన్నీ అందించేలా 'హైదరాబాద్ ఫిలిమ్ జర్నల్' అనే మాసపత్రికను 1960ల ప్రాంతం నుంచి కొన్నేళ్ళు ప్రచురించింది. (2000 ప్రాంతంలో ఈ పత్రిక ప్రచురణను నిలిపివేశారు). చలనచిత్ర ప్రదర్శకులకు అవసరమైన కార్బన్లను అవిచ్ఛిన్నంగా కంట్రోల్ ధరకే సరఫరా చేసేందుకు కృషి చేసింది. సాంఘిక సేవలో సైతం మొదటి నుంచీ చురుకుగా పాల్గొంటూ వచ్చింది. 1967లో రజతోత్సవాలు జరుపుకొంది. అప్పటికి మండలిలో సభ్యుల సంఖ్య 350కి చేరింది. సికింద్రాబాద్‌లో నడుస్తూ వచ్చిన హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ 1999 నవంబర్ 9న ప్రధాన కార్యాలయాన్ని పునరుద్ధరించుకుంది.

ప్లాటినమ్ జూబ్లీ వేళ పేరు మార్పు

అయితే, 1941 నుంచి ప్రత్యేకంగా తన మనుగడను కొనసాగిస్తున్న 'హైదరాబాద్ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' 70వ ఏట అడుగుపెడుతున్న సమయంలో తన పేరెందుకు మార్చుకున్నట్లు? "ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు గురించి 2009 డిసెంబర్ 9న కేంద్ర హోమ్ మంత్రి పి. చిదంబరం చేసిన ప్రకటనతో కొత్త పరిస్థితులు తలెత్తాయి. భావోద్వేగ పరిస్థితులను ఆసరాగా తీసుకొని, 'తెలంగాణ' అనే మకుటంతో పంపిణీదారులు, ప్రదర్శకుల సంఘాల పేరిట రకరకాల సంస్థలు తలెత్తడం మొదలుపెట్టాయి. ప్రభుత్వం, పరిశ్రమ గుర్తింపు లేని ఈ కొత్త సంస్థల గందరగోళాన్ని నివారించి, 70 ఏళ్ళుగా ఉన్న మా అసలైన సంస్థ ఉనికిని చాటుకొనేందుకే మేము 'ది తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్'గా పేరు మార్చాం. ఇప్పటికీ మేము ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో కలసి ఓ అవగాహనతో పనిచేస్తూ, సినీ పరిశ్రమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం" అని మురళీమోహన్ స్పష్టం చేశారు. మొత్తం మీద పేరు మార్చుకున్న హైదరాబాద్ ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రస్తుతం 1000 మంది దాకా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉన్న చలనచిత్ర వాణిజ్య మండళ్ళు – ఏ.పి. ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌లు రెండే!

- రెంటాల జూనియర్



చైనీస్ ఫిషర్‌నెట్స్ హిల్ ప్యాలెస్

ఏ రెండు చిత్రాలూ ఒకేలా ఉండవు. కొన్ని వందల సంవత్సరాలు గడిచినా వీటి మెరుపు కూడా చెక్కుచెదరలేదు.

ఇక్కడి బీచ్ చిన్నదైనా అందంగా ఉంటుంది. బీచ్ పక్కన యూరోపియన్ సంస్కృతిని ప్రతిబింబించే పురాతన భవంతులు కనిపిస్తాయి. బ్యాక్ వాటర్స్ పక్కనే ఉన్న చైనీస్ ఫిషర్‌నెట్స్ కొచ్చికే ప్రత్యేకం. చైనాలో తప్ప మరెక్కగా కనిపించని ఈ వలలు ఇక్కడ అగుపిస్తాయి. స్థానికులు వీటితోనే చేపలు పడతారు.

సూర్యాస్తమయమయ్యేసరికి పడవలను సముద్రం ఒడ్డుకి తీసుకువచ్చి ఆపుతారు. ఆసమయంలో సముద్రం అందాన్ని వర్ణించడానికి మాటలు సరిపోవు... సముద్రం, ఆకాశం కలిసినట్లుండే ప్రదేశంలో బంగారు కాంతులతో మెరిసిపోయే సాగరశోభలను చూడాల్సిందే. ఆ సమయంలో సముద్రంలో ఎగిరిపడే డాల్ఫిన్లను చూడడం అపురూప దృశ్యం.

కొచ్చి నగరానికి 6 కిలోమీటర్ల దూరంలో త్రిపుంతరలోని సువిశాల మైదానంలో హిల్ ప్యాలెస్ ఉంది. ఇది కొచ్చి మహారాజుల నివాస గృహం. ప్రస్తుతం దీన్ని మ్యూజియంగా మార్చారు. ఇందులో రాజవంశీయుల రథాలు, యుద్ధ సామగ్రి, దుస్తుల వంటివి చూడొచ్చు. ఆ రాజవంశానికి చెందిన రాజా రవివర్మ చిత్రించిన వర్ణచిత్రాలు కూడా ఇక్కడున్నాయి. మనసును కట్టిపడేసే, జీవకళ తొణికిసలాడే ఆ చిత్రాలను ఇష్టపడనివారు ఉండరేమో.

సముద్రపు కాలువల్లోని బోల్‌ఘట్టీ అందమైన చిన్న ద్వీపం. ఇక్కడ డచ్‌వారు నిర్మించిన కోట ఉంది. ప్రస్తుతం దీన్ని హోటల్‌గా మార్చారు.

కొచ్చి చుట్టుపక్కల వేగా, ల్యాండ్, డ్రీమ్ వరల్డ్, సిల్వర్ స్టార్మ్, ఫాంటసీ పార్క్ తదితర వాటర్ థీమ్ పార్కులున్నాయి. ఇవన్నీ పిల్లలనే కాదు పెద్దలనూ ఆకట్టుకుంటాయి.

కొంచెం దూరంలో...

కొచ్చికి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో అల్లెప్పే ఉంది. దీన్ని 'వెనిస్ ఆఫ్ ఇండియా'గా పిలుస్తారు. ఇక్కడి వెంబనాద్ సరస్సులో నిర్వహించే పడవ పందేలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. కేరళ అందాలను తనివితీరా చూడాలంటే, ఇక్కడి నుంచి కొచ్చికి బ్యాక్ వాటర్స్‌లో పడవ ప్రయాణం చేయాల్సిందే.

తెక్కడిలోని ప్రసిద్ధిగాంచిన పెరియార్ వైల్డ్ లైఫ్ శాంక్చ్యువరీకి కొచ్చి నుండి రోడ్డు మార్గంలో వెళ్లొచ్చు. ఏప్రిల్, మే నెలల్లో ఇక్కడ త్రిసూర్ పూరమ్ ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి.

ఇక్కడికి దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో మున్నార్ హిల్ రిసార్ట్ ఉంది. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో తేయాకు, యాలకుల తోటలు కనిపిస్తాయి. భూదేవికి చిలకపచ్చ చీర కట్టినట్లుండే ఈ ప్రాంతం పర్యాటకుల్ని వేరే లోకంలో విహరిస్తున్నామన్న భ్రమ కలిగిస్తుంది.

సరసమైన ధరలకే....

షాపింగ్ మాల్ ప్రియులకు కొచ్చి ఖచ్చితంగా నచ్చి తీరుతుంది. పర్యటన గుర్తుగా కొనడానికి ఎన్నో హస్తకళాఖండాలు లభిస్తాయి. కథాకళి మాస్కులు, పడవల వాల్ హ్యాంగింగ్స్, కేరళ సంప్రదాయ చీరలు... ఇలా ఇంకెన్నో వస్తువులు ఆకర్షిస్తాయి. ముఖ్యమైన మరో విశేషమేమంటే ఇక్కడ బంగారు ఆభరణాలు మనం ఊహించనన్ని వెరైటీల్లో దొరుకుతాయి. నాలుగైదు అంతస్తులుగా ఉండే బంగారు షాపులు అనేకం కనిపిస్తాయి. ఒక్కో అంతస్తులో ఒక్కో రకమైన నగలుంటాయి. ఒక అంతస్తులో రాళ్ల నగలూ, ఒక అంతస్తులో పిల్లలకూ, ఒక అంతస్తులో పెద్దలకీ... ఇలా అన్నమాట.

అక్కడి ఆప్యాయతలు, పండుగలు, సముద్ర గాలులు, కొబ్బరి తోటలు, పడవ షికార్లు, గర్జించే మేఘాలు... అన్నీ పర్యాటకుల మదిలో చెక్కుచెదరని జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అందమైన ఆ అనుభూతుల్ని ఎన్నిసార్లు నెమరువేసుకున్నా తనివితీరదు.

కొచ్చికి వెళ్తే అక్కడి వంటలైన పాలడ ప్రథమన్ (ఒక రకమైన పాల పాయసం), అరటి - పనస చిప్స్, కేరళ హల్వా, ఫళంపురి, ఆపం, ఇడియాపం, కేరళ పరటాలను తప్పక రుచి చూడాల్సిందే.

కేరళ రాష్ట్రం సుగంధద్రవ్యాలకు పెట్టింది పేరు. మిరియాలు, యాలకులు, దాల్చిన చెక్క, లవంగాలు, జీడిపప్పు, శొంఠి తదితరాలన్నీ సరసమైన ధరలకు లభిస్తాయి. నాణ్యత కూడా బావుంటుంది.

కొచ్చిలో అన్ని స్థాయిల వారు బస చేయడానికి వీలైన హోటళ్లు ఉన్నాయి. హైదరాబాద్ నుండి కొచ్చికి దాదాపు 25 గంటల ప్రయాణం. అక్టోబర్ నుండి మే నెల వరకు పర్యటనకు అనువైన సమయం. అయితే ఓనం, క్రిస్మస్ సమయాల్లో వెళ్తే అక్కడి ఆచార వ్యవహారాలు చూడ్డానికి వీలవుతుంది. కేరళ మన దేశంలో ఒక రాష్ట్రమైనా అక్కడి వారి ఆచారాలు, వేషభాషలు, ఆహార అలవాట్లు, పండుగలు భిన్నంగా ఉంటా వెళ్లినప్పుడు వాటిని హాయిగా ఆస్వాదించొచ్చు. ★



డచ్‌ప్యాలెస్ డచ్‌ప్యాలెస్ లోపలి భాగం సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి

కరుణైక కుటుంబం

రాజకీయం ⇌ వ్యాపారం





ముత్తువేల్ కరుణానిధి. తొంభయ్యవ పడికి చేరువలో వున్నారు. ఐదుసార్లు తమిళనాట ముఖ్యమంత్రిగా వెలిగిన ఆయనకు రాజకీయాలంటే ప్రాణం. రచనలంటే అమిత ప్రియం. ఆకట్టుకునే ప్రసంగాలు చేయడమంటే మంచినీటి ప్రాయం.

కలైంజర్ తమిళ సంస్కృతి సంప్రదాయాలమీద మంచి పట్టు కలిగిన నేత. వీటి సాయంతోనే [illegible] రంగంలో ఒక వెలుగు వెలిగారు. అక్కడి నుంచే రాజకీయ రంగ ప్రవేశం చేశారు. వసుదైక కుటుంబంలా కరుణైక కుటుంబాన్ని స్థాపించారు. ముగ్గురు భార్యలు, ఆరుగురు పిల్లలు, మనవలు మనవరాళ్లు...! అంతా రాజకీయాల్లోనో, సినీ రంగంలోనో, మీడియాలోనో, వ్యాపారాల్లోనో ఒక వెలుగు వెలుగుతున్న వారే. ఆయనకు తన వాళ్లన్నా...తనకు కావాల్సిన వాళ్లన్నా ఎనలేని అభిమానం. దాదాపు ప్రతి ఒక్కరికీ ఏదో ఒక పదవిని కట్టబెట్టారు. అది కుదరకపోతే కోట్లరూపాయల పెట్టుబడితో వ్యాపారాలు పెట్టించారు. రాజకీయాలను, వ్యాపారాలను సమ్మిళితం చేయడంలో మహాదిట్ట. నిన్నగాక మొన్న జరిగిన రాష్ట్ర ఎన్నికలలో కరుణానిధి అండ్ కో ఘోరపరాజయానికి గురికాగా, అధికార మదంతో-ఆశ్రిత పక్షపాతంతో చేసిన-చూసిన అవినీతి 'నిను వీడని నీడను నేనే' అన్నట్లు వెన్నాడుతోంది. ఈ అవసాన దశలో జైళ్లు, బెయిళ్ల జపంతో సరిపోతోంది. ఇలాంటి ఆసక్తికరమైన అంశాలెన్నిటినో నింపుకున్న కరుణైక కుటుంబం గురించిన ఆసక్తికర కథనం ఈ వారం మీకోసం...

ఆయన రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి...రెండవ భార్య ఓ టీవీ ఛానల్‌లో 60 శాతం వాటాదారు...మూడవ భార్య ప్రభుత్వ పాలనలో సైతం జోక్యం చేసుకునేవారు....పెద్దకుమారుడు కేంద్రమంత్రి...చిన్నకుమారుడు మాజీ ఉపముఖ్యమంత్రి...కుమార్తె రాజ్యసభ సభ్యురాలు, టీవీ ఛానల్‌లో 20 శాతం వాటాదారు...ఇంక మనవళ్లు ఇరువురు సినీ నిర్మాతలు, పంపిణీదారులు...మరో మనవడు కేంద్రమంత్రి, టీవీ ప్రింట్ మీడియా అధినేత...ఇదీ కరుణానిధి వంశవృక్షం. ఆయన రాజకీయాలను వ్యాపారంగా చూస్తుంటే....కుటుంబం వ్యాపారాలను రాజకీయంగా చూస్తుంది.

రాష్ట్రానికి ప్రథమపౌరుడిగా వుంటూ (ఇప్పుడు కాదులెండి! మొన్నటి దాకా!!) అన్ని

కంప్యూటర్ వేగం పెరగాలంటే...



కంప్యూటర్‌లోని డేటా ఎప్పుడూ ఒక క్రమపద్ధతిలో సర్ది వుండాలి. అప్పుడే మనం అడిగిన డేటాను వెంటనే చూపుతుంది. ఉదాహరణకు వంటగదిలో పాత్రలు, వస్తువులు ఎక్కడబడితే అక్కడ పెట్టేస్తే అవసరానికి కావాల్సివి కనిపించవు. అదే వస్తువులను ఒక క్రమపద్ధతిలో సర్దుకుంటే ఇట్టే తీసుకోవడానికి అవకాశం వుంటుంది. అదేవిధంగా మన కంప్యూటర్లో ఎక్కడెక్కడి డేటా అంతా నింపేస్తూ వుంటే, ఆ నింపిన డేటా అంతా కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లో అస్తవ్యస్థంగా పేరుకుపోతుంది. అసలు కంప్యూటర్‌లోని డేటాను నీట్‌గా సర్దుకునే అవకాశముందనే విషయం చాలామందికి తెలియదు. ఒకవేళ తెలిసినా దాని ప్రాధాన్యతను పెద్దగా పట్టించుకోరు. యాక్సెసరీస్‌లో సిస్టమ్ టూల్స్‌లో 'డిస్క్ డీఫ్రాగ్‌మెంటర్' అనే టూల్ వుంటుంది. దీని ద్వారా హార్డ్‌డిస్క్‌లోని మొత్తం డేటాను ఒక క్రమపద్ధతిలో పేర్చవచ్చు. దానివల్ల కంప్యూటర్ వేగం కూడా పెరుగుతుంది. ఆ వివరాలు ఈ వారం ఈ పేజ్‌లో మీకోసం...

మన పొరబాట్లు ఏమీ లేకపోయినప్పటికీ అప్పుడప్పుడూ కంప్యూటర్ వేగం మందగిస్తుంది. ఏదైనా ఒక ఫైల్ మీద క్లిక్ చేసినా ఆ పని వెంటనే జరగదు. అందుకు కారణం హార్డ్‌డిస్క్‌లోని సమాచారమంతా గజిబిజిగా వుండడమే. మనమిచ్చిన కమాండ్‌కి సంబంధించిన ఫైళ్ల సమాచారం హార్డ్‌డిస్క్‌లో ఒకేచోట దొరక్కపోతే, అది ముక్కలు ముక్కలుగా అక్కడక్కడా పడివుంటే, అంతటా వెతకడానికి, ఒక వరుసలో పెట్టడానికి కొంత సమయం అవసరమవుతుంది. మనకు అవసరమైన సమాచారం హార్డ్‌డిస్క్‌లో ఎక్కడవుందో వెతకడం వల్ల ఆలస్యం అవుతుంటుంది. ఇలా జరగకుండా వుండాలంటే తరచుగా డిస్క్ క్లీనప్, డిస్క్ డీఫ్రాగ్‌మెంట్ చేస్తూ వుండాలి. దీనివల్ల హార్డ్‌డిస్క్‌లోని సమాచారం ఒక క్రమపద్ధతిలోకి వస్తుంది. తద్వారా కంప్యూటర్ వేగం పెరుగుతుంది.

డిస్క్‌క్లీనప్

సిస్టమ్ టూల్స్‌లోకి వెళ్ళి డిస్క్ క్లీనప్ టూల్‌ను క్లిక్ చేస్తే సెలెక్ట్ డ్రైవ్ బాక్స్ వస్తుంది. అందులో కావాల్సిన డ్రైవ్‌ని ఎంచుకుని ఓకె చేసి స్కాన్ డిస్క్ స్టార్ట్ చేస్తే హార్డ్‌డిస్క్‌లో క్లస్టర్స్... అంటే సముదాయాలుగా వున్న ఫైళ్లని అది సరిచేస్తుంది. ఈ ఫైళ్లన్నీ ఒకేచోట రాసివుండవు. వాటి మధ్య క్రాస్ లింక్స్ వుంటాయి. ఫైల్ అవసరం చాలా చోట్ల వుండి, సమాచారం ఒకేచోట వుంటే ఇటువంటి లింక్స్ తయారవుతాయి. ఇటువంటి ఫైళ్లని మరమ్మతు చేయవచ్చు. అలాగే కొన్ని బిట్స్ ఫైల్స్ మిగిలిపోయి వుంటాయి. వీటిని 'లాస్ట్ క్లస్టర్స్' అంటారు. వీటిని తీసేయవచ్చు. అవసరం వుంటుందనుకుంటే సేవ్ చేసుకోవచ్చు. దీనివల్ల సిస్టమ్ పని వేగం బాగా పెరుగుతుంది. కంప్యూటర్‌ని సరిగా షట్‌డౌన్ చేయకపోతే మళ్ళీ ఆన్ చేసినప్పుడు కంప్యూటర్ తనంతట తానే డిస్క్‌క్లీనప్‌ని ప్రారంభించి నడిపిస్తుంది. ఈ పని మనమే అప్పుడప్పుడూ చేయడం మంచిది. డిస్క్‌క్లీనప్ అయిన తరువాత డీఫ్రాగ్ చేయడం మంచిది. మెయింటెనెన్స్‌లో ఇదెంతో ముఖ్యమైన భాగం. ఎక్కువగా ఫైల్స్ సేవ్ చేసి డిలీట్ చేసేవారు, తరచూ కొత్త సాఫ్ట్‌వేర్లు ఇన్‌స్టాల్ చేసేవారు మరింత తరచుగా డీఫ్రాగ్ చేయాలి. ఇది వంటిల్లు సర్దుకోవడం మాదిరిగా పనివేగాన్ని పెంచగలదు.

డీఫ్రాగ్‌మెంటేషన్

ఏదైనా పెద్ద ఫైల్‌ను కంప్యూటర్‌లో సేవ్ చేసినప్పుడు అది ఒకేచోట సేవ్ కాకుండా ముక్కలు ముక్కలుగా వివిధ ప్రాంతాల్లో వుంచబడుతుంది. డీఫ్రాగ్‌మెంట్ జరిగేటప్పుడు దాని విండోలో రంగురంగుల బాక్సులు కనిపిస్తుంటాయి. అవి ఒక్కో రంగు ఒక్కో ఫైల్ అన్నమాట. లైనక్స్ వినియోగదారులకు ఈ సమస్య వుండదు. ఎందుకంటే లైనక్స్‌లో ఎప్పటికప్పుడు డీఫ్రాగ్‌మెంటేషన్ దానంతటదే అవుతుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే హార్డ్‌డిస్క్‌లోని ఫైల్ సిస్టంలో చెల్లాచెదరుగా వున్న ఫైళ్ళను ఒక దగ్గరకు చేర్చి, వరుస క్రమంలో పెట్టడాన్నే డీఫ్రాగ్‌మెంటేషన్ అంటారు. దీనివలన హార్డ్‌డిస్క్‌లోని ఫైళ్లు ఒకదగ్గరికి, ఖాళీ ప్రదేశం ఒకదగ్గరకు వస్తుంది. దీనితో హార్డ్‌డిస్క్‌లో ఒక ఫైల్ సేవ్ చెయ్యటానికి లేదా రిట్రీవ్ చెయ్యటానికి పట్టే సమయం బాగా తగ్గుతుంది. కావలసిన సమాచారం ఎక్కడెక్కడో పడివుంటే వెదకాలి కనుక కంప్యూటర్ వేగం తగ్గిపోతుంది. డీఫ్రాగ్ చేస్తే ఒకదానితో ఒకటి సంబంధం వున్న క్లస్టర్స్ అన్నీ ఒకచోటికి చేరుకుంటాయి. మొత్తం విభజన అంతా ఒకే స్క్రీన్‌లో కనబడుతుంది. అరలో రకరకాల పుస్తకాల మాదిరిగా గీతలుంటాయి. అవన్నీ సర్దడం కళ్ళ ఎదుటే జరుగుతుంటుంది. ముందు డీఫ్రాగ్ ప్రారంభం కాగానే అది కాసేపు వెదికి, ఎంత ఫ్రాగ్‌మెంటేషన్ జరిగింది చెబుతుంది. ఫైళ్లని మాత్రం మార్చితే చాలు అంటుంది. లేదంటే ఫుల్ ఆప్టిమైజేషన్ చేయమంటుంది. ఒకసారి డీఫ్రాగ్ చేసి తేడా చూసిన తర్వాత మనకే దాని ఉపయోగం అర్థమవుతుంది. డీఫ్రాగ్ చేయడానికి థర్డ్‌పార్టీ యుటిలిటీస్ కూడా వుంటాయి. వాటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు నార్టన్ యుటిలిటీస్‌లో 'స్పీడ్ డిస్క్' అనే సదుపాయం వుంది. సాధారణంగా హార్డ్‌డిస్క్ ప్రోపర్టీస్‌లో లభించే డీఫ్రాగ్‌మెంటేషన్ టూల్‌ని వుపయోగిస్తాం, ఇందుకు చాలా ఎక్కువ సమయం పడుతుంది. దీనికన్నా పదిరెట్లు వేగంగా పనిచేసే డీఫ్రాగ్‌మెంట్ టూల్ ఒకటి వుంది. అదే పవర్ డీఫ్రాగ్‌మెంటర్ 3.0. దీనిని http://www.softpedia.com/progDownload/Power-Defragmenter-Download-20185.html నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇది విండోస్ డీఫ్రాగ్ కంటే ఎంతో వేగంగా ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుంది. తక్కువ ధరలకే భారీ స్టోరేజ్ సామర్థ్యం గల హార్డ్‌డిస్కులు లభిస్తున్న ప్రస్తుత తరుణంలో గతంలో హార్డ్‌డిస్కు నుండి అనవసరమైన చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించుకునే వారు కూడా చాలా స్పేస్ ఉంది కదా... అని బద్ధకిస్తున్నారు. డిస్క్ స్టోరేజ్ సామర్థ్యం ఎంత భారీగా ఉన్నా అందులో సమాచారం ఇబ్బడి ముబ్బడిగా పేరుకుపోయి ఉంటే ఖచ్చితంగా కంప్యూటర్ పని తీరు మందగిస్తుంది. కాబట్టి వీలైనపుడలా విండోస్‌లోని టెంపరరీ ఫోల్డర్, కుకీస్, హిస్టరీ, టెంపరరీ ఇంటర్నెట్ ఫైల్స్ ఫోల్డర్లలోని ఫైళ్లని డిలీట్ చేసుకోవడం మంచిది. అలాగే స్టార్ట్ > ఫైండ్/సెర్చ్ ఆప్షన్ ద్వారా హార్డ్ డిస్కులో *.tmp, *.~mp, *.gid, *.fts, *.chk, *.00*, *.$$$, *.*$, *.syd, *.old, *.bak వంటి ఎక్స్‌టెన్షన్ నేమ్‌లను కలిగి ఉన్న ఫైళ్లన్నిటినీ తొలగించుకోండి. అవన్నీ డిలీట్ చేసిన తర్వాత ఒకసారి డిస్క్ డీఫ్రాగ్‌మెంటేషన్ ప్రోగ్రామ్‌ని రన్ చేయడం మంచిది. ఒకవేళ ఏవైనా ఫైళ్లని డిలీట్ చేస్తే సమస్య వస్తుందేమోనని సందేహం వచ్చినట్లయితే వాటిని వేరే లొకేషన్‌కి మూవ్ చేసి కొన్నాళ్లపాటు అబ్జర్వేషన్‌లో పెట్టాలి. అప్పటికీ వాటి వల్ల ఎలాంటి సమస్య రాకపోయినట్లయితే వాటిని తొలగించవచ్చు. విండోస్‌లోని డిస్క్ క్లీనప్‌ని రన్‌చేయడం ద్వారా కూడా అధికశాతం వృథా ఫైళ్లని తొలగించుకోవచ్చు.

- కె.ఎక్స్.రాజు

ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

ఐస్‌క్రీమ్ పౌడర్ - 1 పాకెట్
నీళ్ళు -10 కప్పులు
పంచదార -1 కప్పు
జీడిపప్పు -10
యాలకుల పొడి -కొద్దిగా

తయారుచేసే పద్ధతి

ఒక గిన్నెలో నీళ్లు పోసి, బాగా మరగబెట్టాలి. కొద్దిగా చల్లటి నీళ్లు తీసుకుని ఐస్‌క్రీమ్ పౌడర్ని పేస్ట్‌లా కలపాలి. మరుగుతున్న నీళ్లలో ఐస్‌క్రీమ్ పేస్ట్ వేసి బాగా కలియబెట్టాలి. ఇది కలుపుతున్నప్పుడు మజ్జిగ లాగా వెనిల్లా ఫ్లేవర్‌తో వుంటుంది. ఈ నీళ్లు బాగా తెర్లిన తర్వాత దించి ఎగ్‌బీటర్‌తో గానీ, మజ్జిగ కవ్వంతో కానీ చిలకాలి. నురగ వచ్చేవరకు చిలికి చల్లారనివ్వాలి. తర్వాత గిన్నెలో పోసి డీప్‌ఫ్రిజ్‌లో పెట్టాలి. రెండు గంటల తర్వాత గట్టిపడుతుంది. దానిని బయటికి తీసి స్పూన్‌తో బాగా కలిపితే ఐస్‌క్రీమ్ తయారవుతుంది. దీనిని చిన్న బౌల్స్‌లో వేసి పైన జీడిపప్పు, యాలకులపొడి చల్లి సర్వ్ చేయాలి.

వెనిల్లా ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

పాలు - 1 1/2 కప్పు
పాలమీగడ - 1 1/2 కప్పు
పంచదార - ముప్పావు కప్పు
మైదాపిండి - 1 1/2 కప్పు
వెనిల్లా ఎసెన్స్ - అరస్పూన్

తయారుచేసే పద్ధతి

మైదాపిండి రెండు స్పూన్ల పాలలో కలిపి, పేస్టులా తయారుచేసుకోవాలి. మిగిలిన పాలు బాగా మరిగిన తర్వాత మైదాపిండి పేస్టు, పంచదార వేసి గరిటతో కలియబెడుతూ సన్నని సెగపై ఉంచాలి. బాగా ఉడికి చిక్కగా అయ్యాక దించాలి. దానిని చల్లార్చి ఒక ట్రేలో పోసి ఫ్రీజర్‌లో 4, 5 గంటలు వుంచాలి. తర్వాత ఐస్‌క్రీమ్‌ను గిన్నెలో వేసి మజ్జిగకవ్వంతో కానీ ఎగ్ బీటర్‌తో కానీ చిలకాలి. అందులో వెనిల్లా ఎసెన్స్, మీగడ కలిపి మరల ట్రేలో వాక్స్ పేపర్‌వేసి ఐస్‌క్రీమ్ పోసి ఫ్రీజర్‌లో పెట్టాలి. గట్టిపడిన తర్వాత సర్వ్ చేయాలి.

ఫ్రూట్ ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

ఐస్‌క్రీమ్ పౌడర్ - 1 పాకెట్
పాలు - 1 కప్పు
నీళ్లు - 4 కప్పులు
పంచదార - 1 కప్పు
జీడిపప్పు - పావుకప్పు
యాలకులు - 10
అరటిపండు - 1
యాపిల్ - 1
జామపండు - 1
పైనాపిల్ - సగం

తయారుచేసే పద్ధతి

ఐస్‌క్రీమ్ పౌడర్‌ను పాలలో కలిపి పేస్టులా తయారు చేయాలి. నీళ్లను బాగా తెర్లేవరకు మరగబెట్టాలి. ఐస్‌క్రీమ్ పౌడర్ కలిపిన పాలను అందులో వేసి బాగా కలియబెడుతూ వుండాలి. బాగా చిక్కగా అయిన తర్వాత పంచదార, యాలకుల పొడి, ముక్కలు చేసిన జీడిపప్పు వేసి చిక్కగా వుడకనివ్వాలి. తర్వాత దించి చల్లార్చి డీప్‌ఫ్రిజ్‌లో పెట్టాలి. కొంచెం గట్టిగా అయిన తర్వాత మజ్జిగ కవ్వంతోగానీ ఎగ్ బీటర్‌తో కానీ చిలికితే ముద్ద అవుతుంది. అన్ని రకాల పండ్ల ముక్కలు సన్నగా తరిగి ఐస్‌క్రీమ్‌పైన వేసి సర్వ్ చేయాలి.

చీజ్ ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

పాలు - 2 కప్పులు
పంచదార - 1 కప్పు
జొన్న పిండి - 1 స్పూన్
జున్ను - ముప్పావు కప్పు
బాదం పప్పు - పావు కప్పు
పిస్తా - పావు కప్పు

తయారుచేసే పద్ధతి

పాలు బాగా చిక్కగా అయ్యేంతవరకు కాగబెట్టాలి. జొన్నపిండిని పావుకప్పు పాలలో కలిపి వుంచుకోవాలి. పంచదారలో నీళ్ల కలిపి తీగపాకం పట్టుకోవాలి. పాకంలో తరిగిన జున్నును కలపాలి. అందులోనే పాలు పోసి కొంచెం సేపు గరిటతో కటియబెడుతూ వుండాలి. బాగా చిక్కగా అయిన తర్వాత దించి పిస్తా, బాదంపప్పు వేసి చల్లార్చాలి. తర్వాత ట్రేలో పోసి ఫ్రీజర్‌లో 6 గంటలపాటు వుంచి సర్వ్ చేయాలి.

పనీర్ ఐస్‌క్రీమ్

కావలసిన పదార్థాలు

పాలు - 6 కప్పులు
నీళ్లు - అరకప్పు
పనీర్ - 2 కప్పులు
బాదంపప్పు - పావు కప్పు
పంచదార - ముప్పావు కప్పు
జొన్నపిండి - 1 స్పూన్
పిస్తా - పావుకప్పు

తయారుచేసే పద్ధతి

జొన్నపిండి అరకప్పు పాలలో కలిపి వుంచుకోవాలి. మిగిలిన పాలను బాగా మరగబెట్టాలి. కొంచెం చిక్కగా అయిన తర్వాత జొన్నపిండి కలిపిన పాలు పోసి కలియబెడుతూ ఐదు నిమిషాలు పొయ్యిమీద వుంచాలి. నీళ్ళు, పంచదార కలిపి తీగపాకం పట్టుకోవాలి. తరిగిన పనీరును పాకంలో కలపాలి. జొన్నపిండి కలిపిన పాలను కూడా పనీర్ మిశ్రమంలో కలిపి 5 నిమిషాలు పొయ్యిమీద వుంచాలి. ఉడికిన ఐస్‌క్రీమ్ దించి బాదంపప్పు, పిస్తాపప్పు వేసి చల్లారిన తర్వాత 8 గంటలు డీప్‌ఫ్రిజ్‌లో వుంచాలి.






భూలోకంలోని పచ్చపచ్చని అందాలను నీలినీలి చందాలను రాసిగా పోస్తే ఏర్పడేదే కేరళ అంటారు కొంతమంది. అలాంటి కేరళలో కొచ్చిది ప్రత్యేక స్థానం. ఎన్నో ద్వీపాలు, మరెన్నో దర్శనీయ స్థలాలు, ఇంకెన్నో సంస్కృతులు అక్కడ మనకు కనిపిస్తాయి. హాయిగొలిపే సముద్రపు పిల్లగాలులు, సుగంధద్రవ్య పరిమళాలు, ఆ నగర విశిష్టత. ప్రపంచంలోనే ముఖ్యమైన అతి పెద్ద నౌకాశ్రయంగా దీనికి పేరుంది. ఒకప్పుడు ఈ నగరాన్ని పోర్చుగీసువారు, తర్వాత డచ్‌వారు ఏలారు. చారిత్రంగా అంతటి ప్రాధాన్యత కలిగిన కొచ్చి నగర విశేషాలు ఈ వారం.

చూద్దామా



వచ్చే వచ్చే అందాల కొచ్చి

కేరళరాష్ట్ర రాజధాని తిరువనంతపురమైనా వాణిజ్య రాజధానిగా పేరు తెచ్చుకుంది మాత్రం కొచ్చి నగరం. భారతదేశంలోని అందమైన పర్యాటక స్థలాల్లో ఇదొకటి. అంతేనా! ప్రపంచంలోనే ముఖ్యమైన, పెద్ద నౌకాశ్రయం ఇది. ఎందుకంటే భూ, సముద్ర, వాయు మార్గాల ద్వారా రవాణా సౌకర్యం ఉన్న అతికొద్ది నౌకాశ్రయాల్లో ఇదొకటి. అందుకే ఈ నగరాన్ని 'అరేబియా సముద్ర రాణి' అంటారు.

ఆ నగరం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆ నగరంలో వ్యాపార వాణిజ్యాలు చేయాలని చైనా, అరబ్బు దేశాల వారు ఉవ్విళ్లూరారు. యూరోపియన్ దేశస్థులైతే ఏకంగా ఆ నగరాన్నే సొంతం చేసుకున్నారు. వెనిస్ దేశస్థులు సుగంధద్రవ్యాల వ్యాపారం నిరాటంకంగా సాగించారు. వీరందరికీ ఆ నగరమంటే ఎందుకంత ఇష్టమంటే... ఏ దేశంతోనైనా సత్సంబంధాలు నెరపగల నౌకాశ్రయం ఆ నగరంలో ఉంది. ఇన్ని దేశాల సంస్కృతులు అక్కడ ఏళ్లతరబడి ఉన్నాయి. అందుకే ఆ నగర వీధుల్లో ఇప్పటికీ ఆయా సంస్కృతుల పరిమళం గుబాళిస్తుంది. ప్రకృతి సౌందర్యం పర్యాటకులనే కాదు, నిత్యం అక్కడుండే స్థానికులను కూడా మంత్రముగ్ధులను చేస్తుంది.

క్రీ.శ.1498లో వాస్కోడిగామా తన వ్యాపార స్థావరంగా కేరళలోని కాలికట్ తీరాన్ని ఎంచుకున్నాడు. తర్వాతికాలంలో ఇక్కడే స్థిరపడ్డాడు. మరో రెండేళ్లకు పోర్చుగీసువారు వచ్చి కొచ్చి మహారాజు అనుమతితో స్థిర నివాసం నిర్మించుకున్నారు. 1662-63 ప్రాంతంలో పోర్చుగీసు వారి ప్రాబల్యం తగ్గి ఆ ప్రాంతం డచ్చివారి అధీనంలోకి వెళ్లింది. ఆ తర్వాత బ్రిటీష్ పాలనలోకి వచ్చింది. అందుకే ఇప్పటికీ యూరోపియన్ సంస్కృతిని చాటిచెప్పే రాజప్రాసాదాలు, ప్రార్థనా మందిరాలు, చారిత్రక కట్టడాలు ఇక్కడ కనిపిస్తాయి.

అతిప్రాచీన చరిత్ర కలిగిన కొచ్చి నగరాన్ని పాత కొత్తల మేలుకలయికగా అభివర్ణించొచ్చు. ఫోర్ట్ కొచ్చి, మట్టన్‌చెరి, ఎర్నాకులం, ఎడపల్లి, వెల్లింగ్‌టన్, తేవర, నైటిల్ల వంటి ద్వీపాలన్నీ కలిసి కొచ్చి నగరంగా ఏర్పడ్డాయి. వీటన్నింటినీ వంతెనల ద్వారా కలిపారు.

దర్శనీయ స్థలాలు

మెరైన్ డ్రైవ్‌లోని బోట్‌జెట్టీ నుండి కేరళ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కేటీడీసీ) బోట్లలో మట్టన్‌చెరి, ఫోర్ట్ కొచ్చిలకు వెళ్లొచ్చు. సముద్ర కాలువల (బ్యాక్‌వాటర్స్)లో ఈ పడవ ప్రయాణం అద్భుతంగా ఉంటుంది. ఒకవైపు ఎర్నాకులంలోని అత్యంత ఆధునిక ఆకాశ హర్మ్యాలు, ఇంకొక వైపు బోల్‌ఘట్టీ, ఫోర్ట్‌కొచ్చి, మట్టన్‌చెరి దీవులు, మరోవైపు కొచ్చి నౌకాశ్రయంలో నిలిచి ఉన్న పెద్ద నౌకలు... ఇలా ఎటు చూసినా అద్భుతమైన దృశ్యాలే కనిపిస్తాయి.

ఫోర్ట్‌కొచ్చిలో రెండంతస్తుల అందమైన డచ్‌ప్యాలెస్ ఉంది. దీన్ని పోర్చుగీసు వారు నిర్మించారు. తర్వాత వచ్చిన డచ్‌వారు దీనికి ఎన్నో మార్పులు చేర్పులు చేసి కొచ్చి మహారాజుకు కానుకగా ఇచ్చారట. అందుకేనేమో దీన్ని డచ్‌ప్యాలెస్ అనే పిలుస్తుంటారు. ఈ కోట గోడలపై చిత్రించిన రామాయణ, మహాభారతాలకు సంబంధించిన చిత్రాలను చూసి తీరవలసిందే.

యూరోపియన్లు మనదేశంలో నిర్మించిన అతి పురాతన సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి కూడా ఇక్కడే ఉంది. వాస్కోడిగామా మరణించిన తర్వాత ఆయన పార్థివ దేహాన్ని ఈ చర్చిలోనే సమాధి చేశారు.. తర్వాత ఎప్పటికో ఆయన అస్థికలను పోర్చుగల్‌కు తీసుకెళ్లారు. అయితే ఆయన్ని సమాధి చేసిన ప్రదేశాన్ని ఇప్పుడూ చూడొచ్చు.

చూడాల్సిన ప్రదేశాల్లో మరోటి జ్యూయిష్ సినగోగ్. ఇది యూదుల ప్రార్థనా మందిరం. ప్రపంచంలోనే అతి పురాతనమైంది. ఈ మందిరం ప్రత్యేకత ఏంటంటే... చేత్తో పెయింట్ చేసిన కొన్ని వందల చైనీస్ టైల్స్‌ను నేలమీద పరిచారు. వీటిలో



పెరియార్ వైల్డ్ లైఫ్ శాంక్చువరీ

ఎత్తైన పర్వత ప్రాంతాల్లో తేయాకు తోటలు

రంగాలను తన కుటుంబసభ్యులకు ధారాదత్తం చేసి ప్రతిపక్ష పార్టీలను సైతం విస్మయానికి గురిచేసిన వ్యక్తి 'ముత్తువేల్ కరుణానిధి'. రాష్ట్రానికి ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టిన ఆయన ఇటీవల 14వ రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమిపాలయ్యారు. 'కలైంజర్' అని అభిమానులు ముద్దుగా పిలుచుకొనే ఎనభయ్యేడేళ్ల కురువృద్ధుడు కరుణానిధి. ఎవరైనా తనకు ఎదురు తిరిగారూ అంటే అంతే సంగతులు. ఆ వ్యక్తిని తన రాజకీయ అనుభవంతో తొలుత ఒంటరిని చేసి అనంతరం తన దారికి తెచ్చుకొనేలా చక్రం తిప్పడంలో ఆయనకు ఆయనే సాటి. రాష్ట్రంలో రాజకీయ, సినీ రంగానికి అనుబంధం అధికం. సినీరంగం నుండి వచ్చిన అనేకమంది రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేసివున్నారు. దీంతో రాజకీయ ఎదుగుదలకు సినీరంగాన్ని కూడా వాడుకుంటున్న వ్యక్తి ఆయన. ప్రస్తుతం రాష్ట్రంలోని 80 శాతం చలనచిత్ర రంగం ఆయన కుటుంబసభ్యుల ఆధిపత్యంలోనే కొనసాగుతోంది.

కరుణ వ్యక్తిగతం

కరుణానిధి తంజావూరు జిల్లాలోని తిరుక్కువాలై గ్రామంలో 1924 జూలై 3వ తేదీన జన్మించారు. తమిళభాషపై పట్టుకలిగిన ఆయన తన 13వ ఏటనే పలు కథలు, రచనలు చేసేవారు. ఆ కాలంలోనే ఈయన చేసిన ఉపన్యాసాలు అమితంగా ఆకట్టుకునేవి. అప్పట్లో యువజన విభాగంలో పనిచేసిన ఆయనకు రాజకీయాలపై పూర్తి అవగాహన వుండేది. జస్టిస్ పార్టీలోనే 'తమిళ మానవర్ మన్‌రమ్' అనే యువజన విభాగాన్ని స్థాపించారు. ఈ విభాగం ద్వారా తమిళ సంస్కృతి, సాంప్రదాయాలపై అనేక రచనలను, కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం జస్టిస్ పార్టీ 'ద్రవిడ మున్నేట కళగం' (డిఎంకె)గా రూపాంతరం చెందింది.

పె...ద్ద కుటుంబ.....ం!

కరుణానిధి కుటుంబాన్ని చూస్తే ఔరా అనిపిస్తుంది. ఆయనకు ముగ్గురు భార్యలు... మొదటి భార్య పద్మావతి (అనారోగ్యంతో మృతిచెందింది), రెండవ భార్య దయాళు అమ్మాళ్ (ఇటీవల 2జి స్పెక్ట్రమ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కలైంజర్ టీవీలో 60 శాతం వాటాలు కలిగివుంది), మూడవ భార్య రాజాతి (పరిపాలనలో జోక్యం చేసుకుంటుందనే ఆరోపణలు వున్నాయి). పద్మావతికి ఎంకె.ముత్తు అనే కుమారుడు వున్నాడు. రెండవ భార్యకు అళగిరి, స్టాలిన్, తమిళరసు కుమారులతో పాటు సెల్వి అనే కుమార్తె వుంది. మూడవ భార్య రాజాతి అమ్మాళ్‌కు కనిమొళి అనే కుమార్తె వుంది.

ఎంకె. ముత్తును తొలుత కరుణానిధే రాజకీయ రంగంలోనికి తెచ్చారు. కానీ, వ్యసనాలకు లోనయిన అతను సినీరంగానికే పరిమితమయ్యారు. గతంలో కొన్ని చిత్రాలలో నటించిన ఆయన ప్రస్తుతం నేపథ్యగాయకుడిగా వున్నారు. ఎంకె.అళగిరి కరుణానిధి రెండవభార్య దయాళు అమ్మాళ్ పెద్దకుమారుడు. 60 ఏళ్ల అళగిరి కేంద్ర రసాయన ఎరువుల శాఖా మంత్రిగా వున్నారు. తమిళంపై మరీ ఇంత మక్కువా అనిపించే విధంగా ఆంగ్లమే మాట్లాడని ఆయన దేశంలోని ప్రధాన రంగానికి మంత్రిగా వుండడాన్ని కరుణానిధి రాజకీయ చదరంగానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. 1980వ సంవత్సరంలో చెన్నైలో చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్న ఈయన బ్యాంకులో ఉద్యోగం రావడంతో మధురై వెళ్లారు. డిఎంకె పత్రిక అయిన "మురసోలి" మధురై ఎడిషన్ బాధ్యతలను అప్పగించారు. కానీ, ఇది నచ్చని ఆయన ఆ ప్రాంతంలో కేబుల్ టీవీతో పాటు ఫంక్షన్ హాళ్లు, టెక్స్‌టైల్స్ షోరూమ్‌లను ఏర్పాటు చేసి నడుపుతున్నారు. దీంతో పాటు పెద్ద ఎత్తున రౌడీమూకను ఏర్పాటు చేసుకొని ల్యాండ్‌మాఫియాను నిర్వహిస్తూ మధురై పట్టణాన్ని శాసించే వ్యక్తిగా తయారయ్యారు. 'అళగిరి చేసే అక్రమాలను, అన్యాయాలను, హత్యలను పలుమార్లు వార్తలుగా ప్రచురితమయ్యాయి. ఆయా కేసులు కోర్టు వరకూ వెళ్లిన సందర్భాలు అనేకం వున్నాయి' అంటారు జర్నలిస్టు ఇదయ. ఆ ప్రాంతంలో కార్మికులు అధికం. సహజంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, వారి మంచి కోసం పోరాడేది సిపిఎం అన్నది యదార్థం. మధురై పార్లమెంటు స్థానాన్ని సిపిఎం గెలుపొందుతూ వస్తోంది. సిపిఎం విజయాన్ని అడ్డుకొనేందుకు కూడా అళగిరి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇది చూసే మధురై చుట్టుపక్కల జిల్లాలలో కూడా డిఎంకెను బలోపేతం చేసే అవకాశం అళగిరికి కల్పించారు. గతంలో కరుణానిధి తరువాత ముఖ్యమంత్రి ఎవరు? అనే సర్వేను చేపట్టింది 'దినకరన్' పత్రిక. ఈ సర్వేలో అత్యధికంగా అంటే 70 శాతం స్టాలిన్ అని, అత్యల్పంగా అంటే రెండు శాతం అళగిరి అని వచ్చింది. దీంతో రెచ్చిపోయిన అళగిరి మధురైలోని ఆ పత్రికా కార్యాలయాన్ని ధ్వంసం చేసి, నిప్పు పెట్టారు. ఈ దుర్ఘటనలో ముగ్గురు ఉద్యోగులు కూడా మృతిచెందారు. అళగిరిపై తీవ్ర విమర్శలు రావడంతో అతనిని

కరుణానిధి అండ్ కో

దూరంగా వుంచాలని స్వయానా కరుణానిధే తమ స్వంత పత్రిక 'మురసోలి'లో పేర్కొన్నారు. అయితేనేం! ఈ వివాదం సద్దుమణిగిన వెనువెంటనే తిరిగి ఆళగిరికి మధురై పగ్గాలను అందించారు కరుణానిధి. ఈ అవకాశాన్ని ఆళగిరి సద్వినియోగం చేసుకున్నారు. 2009లో జరిగిన ఉప ఎన్నికలలోను, పార్లమెంటు ఎన్నికలలోను ఓటర్లను భయభ్రాంతులను చేసి, ప్రలోభపెట్టి డిఎంకెకు విజయాన్ని చేకూర్చారు. కుమారుడి పని తీరును మెచ్చిన కరుణానిధి తమ మద్దతుతో కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ సారథ్యంలోని యుపిఏ-2లో మంత్రి పదవిని అందించారు. అప్పట్లో లాంబ్రెట్టా స్కూటర్‌తో అద్దె ఇంట్లో నివసించిన ఆళగిరిని కేంద్రమంత్రి స్థాయికి చేర్చిన ఘనత తండ్రి కరుణదే.

ఇంక ఎంకె. స్టాలిన్. కరుణానిధి రెండవ భార్య దయాళుఅమ్మాళ్ రెండవ కుమారుడు. ఆళగిరి తరువాత మూడు సంవత్సరాలకు పుట్టినవాడు స్టాలిన్. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు నేత స్టాలిన్ మరణించిన నాలుగవ రోజు ఈయన జన్మించడంతో ఈ పేరును పెట్టారు. చెన్నయ్‌లోని ప్రెసిడెన్సీ కళాశాలలో చదువుకునే రోజుల్లోనే అంటే తన 14వ ఏటనే పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యువజన విభాగంలో పనిచేస్తుండేవారు. ఆ రోజుల్లోనే పలు రకాల దాడులలో పాల్గొన్నట్లు, ఓ తమిళ నటిపై అత్యాచారం జరిపినట్లు కూడా ఆరోపణలు వున్నాయి. చలనచిత్ర రంగంలో ప్రవేశించి పలు చిత్రాలలోను, స్టేజి ప్రదర్శనల్లోను నటించారు. ఆళగిరిది ముక్కుసూటిగా పోయే మనస్తత్వం కాగా స్టాలిన్ ఇందుకు పూర్తిగా విరుద్ధం. సమయానికి తగువిధంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆయన దిట్ట. యువజన విభాగంలో వున్న సమయంలోనే పార్టీపై మంచి పట్టును సాధించారు స్టాలిన్. 1972లో కీర్తిశేషులు ఎంజిఆర్ డిఎంకె నుండి విడిపోయి ఎఐఎడిఎంకె స్థాపించిన కాలంలో పలువురు సీనియర్ నేతలు ఆయనతో కూడా వెళ్లారు. ఆ సమయంలో డిఎంకెను బలోపేతం

దయాళు అమ్మాళ్‌తో...

చేసేందుకు స్టాలిన్ కృషిచేశారు. ఆయన శాసనసభ్యునిగాను, రెండు పర్యాయాలు చెన్నయ్ నగర కార్పోరేషన్ మేయర్‌గాను ఎన్నికయ్యారు. నిన్నటివరకు ఉపముఖ్యమంత్రిగా కొనసాగారు. తన తండ్రి రాజకీయ అనుభవాన్ని పూర్తిగా అధ్యయనం చేసిన వ్యక్తి స్టాలిన్. రాజకీయంగా ఎదురయ్యే సమస్యలను తన తండ్రి బాటలోనే పరిష్కరించేవారు. దీంతో పార్టీపై పూర్తి పట్టును సాధించారు. 2009లో కోయంబత్తూర్‌లో జరిగిన అంతర్జాతీయ తమిళ మహాసభలలోనే కరుణానిధి వారసుడిగా స్టాలిన్‌ను ప్రకటించనున్నారనే వార్త రాష్ట్రంలో మారుమ్రోగింది. కానీ, ఆళగిరి హెచ్చరికలతో తాత్కాలికంగా వాయిదా పడింది. అప్పట్లో ముఖ్యమంత్రి పదవి విషయమై అడిగిన పత్రికలవారి ప్రశ్నకు ఆళగిరి 'తాను పోటీలో వుంటానని' పేర్కొనగా, 'పార్టీ నిర్ణయిస్తుంది' అని స్టాలిన్ అనడం రాజకీయ చతురతకు నిదర్శనంగా మారింది.

కనిమొళి తక్కువ వయసులోనే తన తండ్రి రాజకీయ కార్యక్రమాలలో వెన్నంటే వుండేది. తండ్రిలా సాహిత్యం, కళలపై ఆసక్తి కలిగిన ఆమె అందులో విశేషంగా రాణించారు. ఆమె ప్రాచీన కళలను వెలుగులోనికి తేవాలనే నినాదంతో 'చెన్నయ్ సంగమం' పేరిట ప్రభుత్వ సహకారంతో 5 ఏళ్లుగా చెన్నయ్ నగరంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేవారు. ఉద్యోగ మేళాల్లో యువతకు ఉపాధి చూపే కార్యక్రమాలను చేపడుతుండేవారు. ఇదే ప్రజలలో ఆమెకు మంచి పేరును సాధించి పెట్టింది. తన మనవలకు చెందిన 'సన్' టీవీ కుటుంబానికి వ్యతిరేకంగా వార్తలను ప్రచారం చేయడంతో తమ ఆధ్వర్యంలో ఓ ఛానల్ వుండాలని కరుణానిధి భావించారు. అనుకున్నదే తడవుగా 'కలైంజర్' పేరిట ఛానల్ రూపుదిద్దుకుంది. రెండవ భార్య దయాళుఅమ్మాళ్ 60, కనిమొళి 20 శాతం వాటాలతో సదరు ఛానల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలు ఆద్యంతం కనిమొళి పర్యవేక్షణలోనే జరుగుతున్నాయని ఇటీవల సిబిఐ సైతం కోర్టుకు తెలిపింది. ప్రజలలోను, రాజకీయంగాను కనిమొళి ఎదుగుదలను గమనించిన కరుణ ఆమెకు రాజ్యసభ స్థానాన్ని చేకూర్చిపెట్టారు. కేంద్రంలో డిఎంకెకు ఏయే మంత్రి పదవులు కావాలి, వాటికి ఎవరిని ఎంపిక చేయాలి అనే విషయాలు కూడా కనిమొళి చూసేవారని కార్పోరేట్ లాబీయిస్ట్ నీరా రాడియా టేపులలో కూడా వెల్లడైంది. కనిమొళి సేవలు అటు పార్టీకి, ఇటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎంతో వుపయోగపడతాయని కరుణానిధి వ్యాఖ్యానిస్తుంటారు. ఈమధ్య 2జి స్పెక్ట్రమ్ కేసులో కటకటాలు లెక్కిస్తున్న కూతుర్ని ఈ అవసాన దశలోనూ వెళ్లి పరామర్శించారు కరుణానిధి.

సోదరి సంతానం!

రాజాతి అమ్మాళ్‌తో...

కరుణానిధి అక్క కొడుకు మురసోలి మారన్. ఆయన కుమారులే కేంద్రమంత్రి దయానిధి మారన్...సన్ గ్రూప్ బాధ్యతలు నిర్వహిస్తున్న కళానిధి మారన్. దయానిధి ఆధ్వర్యంలో 1993లో సన్‌గ్రూపు తన వ్యాపారాలను ప్రారంభించింది. ఈ సంస్థ ఏర్పాటుకు కరుణానిధి 50 లక్షల రూపాయలను అప్పట్లో అందించి వున్నారు. ఈ టీవీ చానల్‌లో కేంద్రం అందించే ప్రకటనలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుండి కూడా భారీగా సమకూర్చారు. స్థానికంగా సన్‌గ్రూపు ప్రారంభించిన 'సుమంగళి కేబుల్ నెట్‌వర్క్'కు కూడా భారీస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు అందించాయి. స్థానిక ఛానళ్లకు ప్రభుత్వ ప్రకటనలు అందించకూడదనే నిబంధన వున్నదనే అన్నా డిఎంకె అధినేత్రి జయలలిత ఫిర్యాదు చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దానిని తోసిపుచ్చాయి. ఒకానొక సమయంలో దయానిధి మారన్‌కు, పార్టీకి మధ్య తలెత్తిన విభేదాలతో సన్‌గ్రూపులోని తన 20 శాతం వాటాలను దయాళుఅమ్మాళ్ వెనక్కి తీసుకోవాలని కరుణానిధి ఆదేశించారు. దీంతో వాటాలలో భాగంగా తనకు వచ్చిన రూ.30 కోట్ల రూపాయలలో రూ.10కోట్లను కరుణానిధికి, మిగిలిన సొమ్మును తన కుటుంబంలోని 21 మందికి అందించారు. ఇది కరుణకు కొంత నష్టాన్నే తెచ్చిందని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం సన్‌గ్రూపు వ్యాపార లావాదేవీలు రూ.20,000 కోట్ల రూపాయల పైనే వున్నాయి. తాజా స్పైస్ జెట్ ఎయిర్‌వేస్‌ను కూడా సన్‌గ్రూపు కొనుగోలు చేసింది.

పాలనలో రాజాతి అమ్మాళ్ జోక్యం

కరుణానిధి మూడవ భార్య రాజాతి అమ్మాళ్ డిఎంకె హయాంలో ప్రభుత్వ పాలనలో తీవ్రస్థాయిలోనే జోక్యం చేసుకొనేవారు. ఇందుకు ఒక చక్కటి ఉదాహరణ 1996లో జరిగిన సంఘటన. డిఎంకె ప్రభుత్వ హయాంలో కరుణానిధి సొంత జిల్లా అయిన తిరువారూర్ కలెక్టర్‌గా ఉమాశంకర్‌ను నియమించారు. అనంతరం అన్నాడిఎంకె అధికారం చేపట్టింది. అనంతరం తిరిగి 2006లో డిఎంకె అధికారంలోకి వచ్చింది. జిల్లా కలెక్టర్‌గా వున్న ఉమాశంకర్ ఎలక్ట్రానిక్ కార్పోరేషన్ ఆఫ్ తమిళనాడు (ఎల్కాట్) సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఎల్కాట్ మత్స్యకారులకు అందించే 45,000



కుమార్తె కనిమొళి కుటుంబంతో...



అన్నాతో...

టెండర్లను తన అనుకూలురకు ఇప్పించమని రాజాతి అమ్మాళ్ ఉమాశంకర్‌ను కోరారు. ఈ విషయమై మాట్లాడేందుకు ఆయనను ఇంటికి రావాల్సిందిగా ఆజ్ఞాపించారు. ఇందుకు నియమాల ప్రకారమే నడుచుకుంటానని ఆయన బదులివ్వడంతో అతనిపై వేటుపడింది. సంస్థ నియమాలకు వ్యతిరేకంగా అనుమతులను అందించారంటూ ఉమాశంకర్‌ను 43 రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఇందుకు 'ప్రభుత్వ పాలనకు సమాంతరంగా ఆమె పాలన సాగిస్తున్నారు. నేను ప్రభుత్వ ఉద్యోగినే కానీ, ఆమెకు కాదు' అని ఆయన వాపోయారు. అనంతరం సన్ టీవీ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు కరుణానిధి ప్రభుత్వం తరపున ఏర్పాటుచేసిన 'అరసు కేబుల్ నెట్‌వర్క్'కు ఆయన మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటుకు సంబంధించి సెట్‌అప్‌బాక్స్‌ల కొనుగోలు, డిజిటల్ హెడ్స్ తదితరాలకు సంబంధించి సుమారు రూ.51 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని గుర్తించారు. కరుణానిధి కుమార్తె సెల్వి (మురసోలి మారన్ సోదరుడు సెల్వమ్ భార్య) ఈ అవినీతికి కారకురాలిగా గుర్తించారు. సన్‌గ్రూపుకు కరుణానిధికి మధ్య తలెత్తిన విభేదాలు తొలగిపోవడంతో అరసు కేబుల్‌పై దాడులు మొదలయ్యాయి. సన్‌గ్రూప్ ఏర్పాటుచేసిన ఎస్‌సివి కేబుల్ విజన్ ప్రాంతాలలోను, మధురైలో ఆళగిరి ఏర్పాటుచేసిన రాయల్ కేబుల్ విజన్ ప్రాంతాలలో అరసు కేబుల్ ఆఫీసులపై దాడి చేసి దానికి సంబంధించిన కేబుళ్లను ధ్వంసం చేశారు. ప్రభుత్వ ఆస్థిని ధ్వంసం చేసినందుకు ఆ రెండు కేబుల్ ఆపరేటర్లపై చేసిన ఫిర్యాదులను పోలీసులు తోసిపుచ్చారు. దీంతో ఉమాశంకర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్‌లో అధికారం లేని పోస్టుకు బదిలీఅయ్యారు.

సినీరంగంపై పెత్తనం

తమిళ ప్రజలు చిత్రరంగాన్ని ఆదరిస్తారు. సినీరంగంలోని నటులకు గుళ్లు కట్టి పూజిస్తారు. అవకాశం వస్తే వారిని రాజకీయంగా అత్యున్నత స్థాయికి పంపుతారు. ఇది ఎంజీఆర్ హయాం నుండి వస్తోంది. దీంతో కరుణానిధి కూడా అప్పట్లో సినిమాలకు కథలు, పాటలు అందించేవారు. ఆయన కుమారుడు ఎం.ఎ. ముత్తు కూడా ఇప్పటికి నేపథ్యగాయకుడిగా వున్నారు. ఆయన మరో కుమారుడు స్టాలిన్ సైతం పలు చిత్రాలలో నటించారు. సినీరంగంలో సన్‌గ్రూప్ సన్‌పిక్చర్స్ నిర్మాణరంగంలోకి అడుగిడింది. మరి కొన్ని చిత్రాలకు పంపిణీదారునిగా కూడా ఎదిగింది. స్టాలిన్ కుమారుడు ఉదయానిధి స్టాలిన్ 'రెడ్‌జెయింట్ మూవీస్' పేరుతో అటు నిర్మాణ, పంపిణీ రంగంలో వుండగా, ఆళగిరి కుమారుడు దయానిధి ఆళగిరి 'క్లౌడ్‌నైన్ మూవీస్' పేరిట చిత్రాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విడుదల అవుతున్న చిత్రాలలో అధికశాతం వీరు నిర్మించినవే. లేదా వీరు పంపిణీచేస్తున్నవే. తాజాగా స్టాలిన్ కొడుకు ఉదయానిధి, మరో మనవడు తమిళరసు తాజాగా హీరోలుగా చలనచిత్ర రంగానికి పరిచయం అవుతున్నారు. సినీరంగంతో పాటు టీవీ మీడియా కూడా వీరి చేతుల్లో వుండడంతో చిత్రాలకు సంబంధించి పబ్లిసిటీ కూడా అధికంగా ఇచ్చేవారు. ప్రస్తుతం ప్రజాదరణ పొందుతున్న ఎఫ్.ఎం రేడియోలో సైతం సన్‌గ్రూప్‌కు చెందిన '93.5 ఎఫ్.ఎం వుంది. ఇందులో వారు నిర్మించే చిత్రాలకు సంబంధించిన పాటలే తరచూ ప్రసారం అవుతూ ప్రచారం పొందుతున్నాయి. రాష్ట్రంలోని 80 శాతం థియేటర్లను వీరే లీజుకు తీసుకొని చిత్రాలను విడుదల చేస్తున్నారు. ఓ నిర్మాత ధైర్యం చేసి చిత్రాన్ని నిర్మించినా సన్‌గ్రూపు, రెడ్‌జెయింట్ మూవీస్ వారికే పంపిణీ హక్కులు అందించాలి. లేకపోతే చిత్ర ప్రకటనలు కానీ పాటలు కానీ ప్రజల వద్దకు చేరుకోలేవు. దానిని అధిగమించి చిత్రాన్ని విడుదల చేయాలంటే థియేటర్లన్నీ వారి చేతుల్లోనే వుండడంతో నిర్మాతకు మిగిలేది నష్టాలే. అందుకు ఏ నిర్మాతా సాహసం చేయడం లేదు. ఒకవేళ నిర్మించినా వారికే అమ్మి వచ్చిన సొమ్ముతో తృప్తి పడాల్సిందే. 2010లో రాష్ట్రంలో సుమారు 145 చిత్రాలు విడుదల అయ్యాయి. కానీ వీటిలో 45 చిత్రాలకు విడుదల చేసేందుకు థియేటర్లే లేకుండాపోయాయి. వీరందరూ ఒక రకంగా డిఎంకె కుటుంబపాలనను అంగీకరించని వాళ్లుగా వున్నారు. సాక్షాత్తు సూపర్‌స్టార్ రజనీకాంత్, పద్మశ్రీ డాక్టర్ కమల్‌హాసన్‌తో పాటు ప్రస్తుతం మంచి యూత్ ఫాలోయింగ్ వున్న నటుడు విజయ్ కూడా ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో రజనీకాంత్ తరువాత పెద్ద సంఖ్యలో అభిమాన సంఘాలు వున్న నటుడు విజయ్. ఈయన ఎన్నికల తొలినాళ్లలో అన్నాడిఎంకెలో చేరనున్నట్లు వార్తలు రావడంతో ఈయన తదుపరి చిత్రం 'కావలన్' చిత్రాన్ని విడుదల చేసేందుకు థియేటర్లే దొరకని పరిస్థితి నెలకొంది. చిత్రనిర్మాణ రంగంలో పేరుపొందిన ఎవిఎం సంస్థ సైతం చిత్రాలను తీయడం మానుకొన్నట్లు ఈ సంస్థ సిఈఓ ఎస్. బాబు పేర్కొన్నారు. 2008లో రజనీకాంత్‌తో ఎవిఎం నిర్మించిన 'శివాజి' చిత్రం పబ్లిసిటీని తమకు అందించాలంటూ కలైంజర్ టీవీ ఒత్తిడి చేసింది. విధిలేని పరిస్థితులలో ఆ పనిచేసినా ఆ చిత్రం పరాజయంతో ఎవిఎం నష్టాల బారిన పడింది. ఇక తాము చిన్న బడ్జెట్ చిత్రాలనే నిర్మిస్తామంటున్నారు సంస్థ సిఈఓ.

ఇక ఆ పార్టీ సీనియర్ నేతలు కూడా కరుణ బాటలోనే నడుస్తున్నారు. తమ కుటుంబ సభ్యులను కూడా రాజకీయనేతలుగాను, పారిశ్రామికవేత్తలుగాను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నారు. రాష్ట్రంలో అధిక ధరలు, కరెంటు కోత, వ్యవసాయ రంగంలో సంక్షోభం లాంటి సమస్యలు పెరుగుతున్నా, వాటిని పరిష్కరించేందుకు అధికార డిఎంకె శ్రద్ధ చూపకపోగా, ఫ్లై వోవర్, మెట్రోరైలు, సబ్‌వేలు నిర్మిస్తున్నామంటూ మురిసిపోయింది. ఇవి ప్రజలకు ఏమేరకు ఉపయోగపడతాయో వారే చెప్పాలి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతులు బాగుండాలని, అప్పుడే విదేశాల నుండి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని డిఎంకె సరికొత్త భాష్యం చెప్పింది. కొత్తవి సరే పాత వాటి సంగతేంటి అని ప్రజలు ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తలమానికంగా నిలిచిన రంగాలను వదిలి...విదేశీ కంపెనీలకు రాష్ట్రాన్ని అప్పగించారంటూ ప్రజలు డిఎంకెపై ఆగ్రహించారు. కుటుంబపాలన సాగిస్తూ వేల కోట్లరూపాయలను పోగుచేసుకుంటున్న ఆపార్టీని తీసుకెళ్లి ప్రతిపక్షంలో కూర్చుండబెట్టారు.

- టి. సుమన్ కుమార్,

ప్రజాశక్తి ప్రతినిధి, చెన్నయ్.

కథ

"ఉరే.. ఈరయ్యా... ఈనాడైనా ఓ యాభై కళ్ల సూత్తావురా...?" కుక్కిమంచంలో రెండు కాళ్లూ ముడుచుకుని పడుకున్న సుబ్బులు అదేపనిగా దగ్గుతూ మధ్యమధ్య అరిచేత్తో గుండెలనదుముకుంటూ... రెండు పక్కలా నిండుగా పేర్చుకున్న కుండల కావడిని భుజానికెత్తుకుని బయల్దేరబోతున్న వీరయ్యతో అంది.

స్పృహ

- ఆర్.డి. మల్లేశ్వరరావు

"ఏం యాబయ్యే... యాబయ్యి..!" ముఖం చిట్లిస్తూ కసురుకున్నాడు వీరయ్య.

"ఈపూట కూడా మందేసుకోపోతే రోగమింకా ముదిరిపోద్దని సెప్పాడ్రా సైకిలు డాట్రు" సుబ్బులు గొంతులోంచి నీరసం నిండిన మాటలు ఆగాగి వస్తున్నాయి.

"నిజమేనమ్మా... నన్నేం సేయమంటావ్! రాబడుందా... నువ్వూ సూస్తానే ఉండావుగా..." చిరాకు పడ్డాడు.

"అలా సీరాకు పడవోకురయ్యా.. నాలుగు పొద్దులుగా ఒళ్లంతా సలివిడి ముద్దలాగుంది. నాలిక పిడసగట్టుకుపోనాది. పొట్టలో ఏదో దేవేత్తన్నట్టున్నాది. ఇయ్యాలైనా ఓ యాభైతెత్తే సైకిల్ డాట్రోరికిచ్చి సూయించుకుంటా" లేచి కూర్చోడానికి ప్రయత్నిస్తూ లేవలేక అలానే మంచాన్నంటి పెట్టుకుని నసుగుతున్నట్లుగా అంది సుబ్బులు.

"నాకు మాత్రం లేదా నీకు సూయించాలని! ఆర్ద్రతగా అన్నాడు వీరయ్య.

సుబ్బులు కన్నీళ్లు పెట్టుకుంది.

"అలా ఏడవమాకే. నేనేవన్నా ఇంటికాడ కూకుంటున్నానా? ఈడనుంచి ఆడికి నడిసెల్లి పొద్దుగూకులు తిరిగినా కుండల్నొక్కరూ కొనకబోతిరి. పోనీ... ఏ రోడ్డుపక్కనో పెట్టుక్కూసుంటే ట్రాపిక్కడ్డవంటూ పోలీసోళ్లు సెదరగొట్టేస్తున్నారు. ఎక్కడని అమ్మాలి. ఎలాగని బతకాలి. నిన్నెలా బతికించుకోవాలి. సీ! ఎదవ బతుకు...!" దిగులుపడ్డ మనసుతో కుమిలిపోయాడు వీరయ్య.

ఇంతలో నీళ్లకుండ మోసుకుంటూ సీతాలు ఎదురుగా రావడం వీరయ్య చూశాడు. కోపం తన్నుకొచ్చింది. ఉన్నపళాన చేతిలోని కావడి కిందికి దింపి విసురుగా సీతాలుకెదురెళ్లాడు.

"ఏమే నామాటలకి ఇలువ లేదా...?" అంటూ సీతాలు చెంపమీద ఛెళ్లున కొట్టాడు.

సీతాలు భుజాన్నానుకుని ఉన్న నీళ్లకుండ దబ్బున కిందపడి పగిలిపోయింది. సీతాలు కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. చెంప కమిలిపోయింది. వడివడిగా అడుగులేస్తూ పొంగుతున్న కన్నీళ్లనాపుకుంటూ ఇంట్లోకెళ్లింది. సుబ్బులు మంచాన్నానుకుని నేలమీద కూలబడింది సీతాలు.

వేగంగా అడుగులేస్తూ సీతాలు వెనుకే లోపలికొచ్చాడు వీరయ్య.

ఎన్ని సార్లు సెప్పానే సీతాలూ! తొలిచూలుదానివని నీల్లు మోయొద్దని. ఆ రూబేనుగాడేవన్నా నీళ్ల తేనన్నాడా?! కుండెడు నీళ్ల కోసం అంతదూరం నడిసెల్లి పడిగాపులు పడితే నువ్వు మంచానపడతావు గదా...?! అంత కోపంలోనూ ఆప్యాయత కురిపించాడు.

"నీ మాటే ఇన్నాను గద బావా! కానీ ఆ రూబేను గాడికి ఇసపు జరమేదో వచ్చిందంట. నాలుగు పొద్దులాగా రానేలేదు. పోనీ ఆడికెవురన్నా మందిత్తే గదా లేసి రాడానికి. అందుకే నేనెల్లా" పైటకొంగుతో కళ్లు తుడుచుకుంటూ చెబుతోంది సీతాలు.

మౌనంగా వింటున్నాడు వీరయ్య.

"అదీ నిజమే. ఏ రోగమొచ్చినా, నొప్పొచ్చినా పల్లెల్లో ఉండేవాళ్లు ఏమైపోయినా పట్టించుకునే వాళ్లెవరు? నీళ్ల కోసం ఎన్ని మైళ్లు నడవాలో... ఉన్న ఊళ్లో ఒక్క పంపైనా లేదుకదా!? ఇక కూటికోసం పడే పాట్లైతే చెప్పనే అక్కర్లేదు. గామస్వరాజ్యం... గామ స్వరాజ్యం... అని చెప్పే నాయకులెవ్వరూ ఓట్లడగడానికి వచ్చినప్పుడు తప్ప మరెప్పుడూ కంటికి కనబళ్లేదు కదా? ఎన్ని పెబుత్వాలు మారాయి?! ఎన్నెన్ని మాటలు చెప్పాయి? ఎంతెంత డబ్బు మూటగట్టుకున్నాయి? అందులో నూటికి ఒక రూపాయి వంతైనా గామాలకి ఖర్చుపెడితే ఎన్ని పల్లెలకు జీవమొస్తుందో కదా?!

ఇలా పరిపరివిధాల ఆలోచిస్తున్నాడు వీరయ్య తనకున్న కాస్త జ్ఞానంతో.

ఎన్ని ఆలోచించినా ఏం లాభం? తన బతుకు మారడంలేదు. దినదినగండంగానే గడిచిపోతోంది జీవితం.

నిస్పృహ ఆవరించిన మనసుతో... కాసుల వేటకు కావడినెత్తుకుని బయల్దేరాడు.

◆◆◆

మట్టి దారుల వెంట ఆదుర్దాగా అడుగులేస్తున్నాడు వీరయ్య. ఎండ ముదరకముందే వెళ్లి ఈ రోజైనా నాలుక్కుండలమ్మేయ్యాలి. లేకపోతే ఇంట్లో పరిస్థితి ఎంత దీనం?

తనను తానే ప్రోత్సహించుకుంటూ నడకలో వేగం పెంచాడు. కాసేపటికి ఎండ ముదిరింది. చెప్పులు ఆసరా కూడా లేని పాదాలు ఎండవేడిమికి చురుక్కుమంటున్నాయి. కానీ వీరయ్యలో స్పందన లేదు. ఎలాగైనా ఈ రోజు యాభై రూపాయలైనా బేరం చేసుకోవాలి. ఎంతసేపైనా సరే. ఎన్ని రోడ్లయినా సరే తిరగాలి. వీరయ్యలో దృఢ నిశ్చయం నిండిపోయింది.

మనో వేగంతో పోటీ పడుతున్నాయడుగులు. ఇంతలో మొన్న జరిగిన ఎన్నికల సమయంలో 'ఒరే ఈరిగా...! ఈ పాలి నీ ఓటు చేతికే' అంటూ ఓ వంద నోటు చేతిలో పెడుతూ బతిమాలినట్లు అన్న రెడ్డిగారు ఎదురుగా స్కూటర్‌మీద రావడం గమనించాడు వీరయ్య.

ఎన్నికల్లో కనిపించిన రెడ్డిగారు... ఎన్నికలయ్యాక అస్సలు కనిపించనేలేదు.

తనను దాటుకుంటూ పోతున్న రెడ్డిగారిని చెయ్యి చూపుతూ ఆపాడు వీరయ్య. స్కూటర్‌ని స్లో చేస్తూ వీరయ్యకి దగ్గరగా వచ్చి ఆగాడాయన.

"అయ్యా రెడ్డిగారు. పల్లెజనానికి పెబుత్వం ఏదో పని చూపిత్తోందంట గదండీ... అది మీ

బామ్మర్ది గారి చేతుల్లోనే ఉండంటగా. పని ఇప్పిచ్చి కాస్త పున్నెం కట్టుకుందురూ" చేతులు జోడించి వేడుకుంటున్నట్టుగా అన్నాడు వీరయ్య.

"నిజవేననుకో... కానీ నువ్వు చేతికే ఓటేశావంట్రా...?" ప్రశ్నించాడు వీరయ్యని ఎగాదిగా చూస్తూ.

హతాశుడయ్యాడు వీరయ్య. ఎక్కడలేని ఆత్రుత నిండిపోయింది వీరయ్యలో.

"అదేంటయ్యా అలాగంటారు. మీరు సెప్పడమూ... మేం సెయ్యకపోవడమూనా..?" రెడ్డిగార్ని సమర్థిస్తున్నట్టుగా జవాబిచ్చాడు వీరయ్య.

ఏమనుకున్నాడో ఏమో "సర్లే చూస్తాను గానీ... ప్రభుత్వం వాళ్లిచ్చేదాన్లో పదిరూపాయలు కోసుకుంటాడు మా బామ్మర్ది. దానికిష్టమైతే చెప్పు" అంటూనే స్కూటర్ని లాగించేశాడు.

ఏం చెయ్యాలో అర్థం కాలేదు వీరయ్యకి. ఒక్కటి మాత్రం అర్థమైంది. అందిన కాడికి అందరూ పేదోళ్లని దండుకునేవాళ్లేనని! ఆశా నిరాశలమధ్య కొట్టుమిట్టాడుతోంది వీరయ్య మనసు. కుండల కావడిని తిరిగి భుజానికెత్తుకున్నాడు.

◆◆◆

నాలుగు వీధుల కూడలిలో ఓ చెట్టుకింద కావడి దింపుకుని కొనేవాళ్లకోసం ఎదురుచూస్తున్నాడు. చాలా సేపయ్యింది. అయినా ఎవ్వరూ కుండలు కొనేందుకు రావడం లేదు. పోనీ తిరిగి వెళ్దామా అంటే, ఇంట్లో మంచంలో రోగంతో బాధపడుతున్న తల్లి కళ్లముందు మెదిలింది. సన్నటి కన్నీటిపొర వీరయ్య కనుగుడ్లను కమ్మేసింది. భరోసాలేని తన బతుకుని తనే తిట్టుకున్నాడు.

నడినెత్తికి చేరిన భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.

వేసవి గాలులు వీస్తున్నాయి. గొంతు తడారిపోతోంది. పంపేదయినా ఉంటుందేమోనని వెతికాడు.

ఎక్కడా నీళ్ల పంపు కనిపించలేదు.

నాలుగడుగులు ముందుకేశాడు కుండల కావడినక్కడే వదిలి.

రోడ్డుకి ఓ మూలగా చిల్లర దుకాణం ఉంది. జేబులోంచి రూపాయి తీసి నీళ్ల పాకెట్ కొని గొంతు తడుపుకున్నాడు.

ఈ పాటికే అక్కడ చేరిన నలుగురు పెద్ద మనుషుల మధ్య వేడిగా సాగుతున్న సంభాషణ వీరయ్య చెవుల్ని తాకుతోంది.

"పెబుత్వం ఏదో పనిచూపిత్తోందంట గదండీ... అది మీ బామ్మర్ది గారి చేతుల్లోనే ఉండంటగా. పని ఇప్పిచ్చి కాస్త పున్నెం కట్టుకుందురూ" చేతులు జోడించి వేడుకుంటున్నట్టుగా అన్నాడు వీరయ్య.

"నిజవేననుకో... కానీ నువ్వు చేతికే ఓటేశావంట్రా...?" ప్రశ్నించారు రెడ్డిగారు వీరయ్యని ఎగాదిగా చూస్తూ.

వడగాలి నుండి రక్షణగా చెవులకు బిగించి కట్టుకున్న తుండుగుడ్డను మెల్లగా విప్పాడు వీరయ్య.

ఆ నలుగురి సంభాషణ మరికాస్త సూటిగా, స్పష్టంగా చెవుల్లో పడుతోంది. వారి మాటల్ని రిక్కించి మరీ వింటున్నాడు. ఆ మాటలు వింటున్న అతనిలో ఏదో కదలిక... అసహనం, ఆందోళన.. చోటు చేసుకున్నాయి.

ఆ నలుగురి సంభాషణలో నిక్షిప్తమైన సమాచారం వీరయ్యని కదిలించింది. కలవరపెడుతోంది. మనసుని కుదిపేస్తోంది కూడా!

అందులోనూ డబ్బున్న పెద్దోళ్లమీద పట్టరాని కోపం వస్తోంది. ఆవేశంతో ఊగిపోతున్నాడు వీరయ్య!

తనలో పెల్లుబుకుతున్న ఆవేదనను ఎవరిమీద వ్యక్తం చేయాలో అర్థంకావడంలేదు. 'ఆళ్లకి కూత్తి కూడా మనసులేదు... ఆలోచన లేదు' తనలో తనే గట్టిగా అరుస్తున్నట్టుగా అన్నాడు.

చుట్టుపక్కలెవ్వరూ అతని మాటలకు స్పందించలేదు.

"సదువుకున్నారే గానీ.. ఆళ్లకి తలకాయలే లేవు. ఉంటే ఇలా సేత్తారా?!" తిరిగి గట్టిగా అన్నాడు వీరయ్య. ఈసారీ ఎవరూ పట్టించుకోలేదు.

"ఏం అన్ని కోట్లెట్టి అయ్యోరికి కిరీటం చేయించాలా? అయ్యోరేవన్నా ఈళ్లనడిగాడా? కిరీటం సేయించమని. ఏం... మాబోటి కూటికి లేనోళ్లకి కాస్త సాయం చేయొచ్చుగా" ఆవేశంగా ఊగిపోతూ అంటున్న వీరయ్య మాటలకు ఈసారి అక్కడున్న జనం పోగయ్యారు.

అయినా వీరయ్యలోని ఆవేశం తగ్గలేదు.

"తాగటానికి గుక్కెడు నీళ్లు లేక, తింటానికి గుప్పెడు గింజల్లేక, కడతానికి బట్టల్లేక, వుంటానికిల్లు లేక రోజూ చస్తా... బతికే మా బోటోళ్లకిత్తే... ఆ కోట్లకి పలితమయినా వుండేది!"

పిచ్చిపట్టిన వాడిలా అరుస్తున్నాడు వీరయ్య. అతని అరుపులకీ... ఆవేశానికీ అర్థముంది. చుట్టూ చేరిన జనం వింతగా కళ్లప్పగించి చూస్తున్నారు.

వీరయ్య మాటలు సభ్య సమాజాన్ని కడిగిపారేస్తున్నాయి. ధనవంతుల పైత్యపు ఆలోచనలను దుమ్మెత్తిపోస్తున్నాయి. పేదల పట్ల పెద్దలు ప్రవర్తిస్తున్న తీరుకు అద్దం పడుతున్నాయి వీరయ్య మాటలు.

ఒక బడా వ్యాపారి ఎన్నో కోట్లు కుమ్మరించి ఏడుకొండల స్వామికి కిరీటం చేయించిన విషయం ఆ నలుగురి సంభాషణ ద్వారా తెలుసుకున్న వీరయ్య లాంటి నిరక్షరాస్యుడిలో వచ్చిన ఆలోచన. అక్కడ గుమిగూడిన జనాన్ని ఆలోచింపజేసింది. ఆశ్చర్యానికి గురిచేసింది.

వీరయ్య ఆవేదనలోని వాస్తవాన్ని గుర్తించే పనిలో పడ్డారందరూ. ఆ క్షణంలో అందరిలోనూ పేదల పట్ల పక్షపాతం ఆవహించింది! కానీ ఏం చెయ్యగలరు? అంతా సాధారణ పౌరులే... సామాన్య పౌరులే. కానీ ఏదైనా చెయ్యాలనే ఆలోచన మాత్రం వారికి తట్టింది. వారి మనసుల్లో సమాజం పట్ల బాధ్యత చోటు చేసుకుంది.

ప్రస్తుతానికి వీరయ్య ఆశ మాత్రం ఆక్రందనగానే మిగిలిపోయింది! బహుశా ఈ ఆక్రందనే సమాజం మారడానికి దోహదపడుతుందేమో!?

అడుగులో అడుగేస్తూ కుండల కావడి దగ్గరకి చేరుకున్నాడు వీరయ్య. అప్పటిదాకా కుండలపై కూర్చుని ముక్కుతో కుండల్ని పొడుస్తూ ఆడుతున్న కాకిపిల్ల తుర్రున పారిపోయింది.

★

వికాసం

శాపం కానున్న భూతాపం



చెట్లు గాలిలోని కార్బన్ డై ఆక్సైడ్‌ని పీల్చుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. ఇలాంటి పచ్చని చెట్లు క్రమక్రమంగా భూగోళం మీద తరిగిపోతుంటే ... భూతాపం అంతకంతకు పెరిగిపోతుంది. వ్యాధులు విజృంభిస్తాయి. ఇటువంటి సందర్భాల్లో మానవాళి మనుగడ ఎలా? ఊహించుకుంటేనే భయం వేస్తుంది. మరి భూతాపం పెరగడం వల్ల కలిగే అనర్థాలేమిటో ఈ వారం తెలుసుకుందాం.

- సి.వి. సర్వేశ్వరశర్మ

ఫోన్ నెం: 9866843982

sarma.chavali@gmail.com

పర్యావరణ పరంగా చెట్లు చేసే మేలు ఎన్నటికీ మరువలేం. భూతాపం జీవరాశి మనుగడకు ఎంతో అవసరం. కాకపోతే ఇది స్థిరంగా ఉండాలి. భూతాపం అదుపు తప్పి పెరగడం మొదలుపెడితే ఎన్నెన్నో ప్రమాదాలు ఎదురవుతాయి. సూర్యుని నుండి పరారుణ కిరణాల రూపంలో భూమిపైకి వేడి చేరుతోంది. ఈ కిరణాలు భూమిపైపడి తిరిగి పరావర్తనం చెంది అంతరిక్షంలోకి వెళ్లిపోవాలి. వాతావరణంలో పేరుకు పోయి ఉన్న కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, ఓజోన్, నీటి ఆవిరి వంటి గ్రీన్ హౌస్ వాయువులు ఈ పరారుణ కిరణాలు అంతరిక్షంలోకి వెళ్లిపోకుండా భూమ్మీద గల వాతావరణంలో పట్టి ఉంచుతున్నాయి. నిజానికి ఈ పరారుణ కిరణాలు భూమి పై పరావర్తన అనంతరం అంతరిక్షంలోకి వెళ్లిపోయి ఉంటే... భూమి ఉష్ణోగ్రత ప్రస్తుత ఉష్ణోగ్రత కన్నా 30 డిగ్రీల సెల్సియస్ తక్కువ ఉంటుంది. అలా జరిగి ఉంటే భూమి మీద జీవజాలం ఉనికి ప్రశ్నార్థకమై ఉండేది.

పెరుగుతున్న భూతాపం

ఈ గ్రీన్ హౌస్ వాయువుల వల్ల భూతాపం స్థిరంగా ఉంటోంది. అయితే 19వ శతాబ్దం నుండి ఈ గ్రీన్ హౌస్ వాయువులు అసహజమైన స్థాయిలో వాతావరణంలో పేరుకు పోవడం వల్ల పరారుణ కిరణాలను మరింత అధికంగా పట్టి ఉంచుతున్నాయి. ఆ కారణంగానే భూతాపం పెరిగిపోతోంది. దీనితో ఎన్నెన్నో సవాళ్లు ఎదుర్కోవలసిన పరిస్థితి ఉత్పన్నమౌతోంది. ఇదే రీతిలో భూతాపం పెరిగిపోతూ ఉంటే 2100 నాటికి భూమి మీద గల అడవులలో 40 శాతం అడవులు అంతరించిపోతాయని కంప్యూటర్ స్టిములేటెడ్ స్టడీస్ ద్వారా జపాన్ పరిశోధకులు అంచనాలు వేశారు. చనిపోయిన చెట్లనుండి విడుదలయ్యే కార్బన్ డై ఆక్సైడ్ వల్ల భూమి ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. రాబోయే శతాబ్దం నాటికి భూమి ఉష్ణోగ్రత మూడున్నర డిగ్రీల సెల్సియస్ పెరుగుతుందని కంప్యూటర్లు విశ్లేషించి చెబుతున్నాయి. ఈ ఉష్ణోగ్రత పెరుగుదల రెండు డిగ్రీలకు తగ్గించగలిగినప్పటికీ ఇరవై ఆరు శాతం అడవులు అంతరించిపోతాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, భారత్, ఆఫ్రికా దేశాల్లో అడవులకు ఎక్కువ నష్టం వాటిల్లుతుంది.

వాయువుల ప్రభావం

కార్బన్ డై ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ లాంటి విషవాయువులు, క్లోరో ఫ్లోరో కార్బన్స్ లాంటి విషరసాయనాలు వాతావరణంలో అధికంగా చేరుతుండడం వల్ల ఇప్పటికే ప్రపంచ ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్ పెరిగిపోయింది. 1980 దశకం నుండి ప్రపంచ చరిత్రలో వరుసగా 'అత్యుష్ణ సంవత్సరాలు' గా ఏ ఏడాది కాఏడాదే నమోదు అవుతున్నాయంటే భూతాపం ఏ స్థాయిలో పెరుగుతున్నదీ అర్థం చేసుకోవచ్చు. 1998 అత్యంత వేడి సంవత్సరంగా నమోదు అయినప్పటికిని 2003 సంవత్సరం దానిని అధిగమించింది. ఇటీవల సంవత్సరాలన్నీ మండుటెండల సంవత్సరాలుగా నమోదు అయ్యాయి. బొగ్గు లాంటి ఇంధనాలు కాల్చడం వల్ల ఇంకా ప్రకృతిలో సహజసిద్ధంగా ఉత్పత్తి అయ్యే కార్బన్ డై ఆక్సైడ్ వాతావరణంలో సగటున 100 సంవత్సరాల పాటు ఆవిధంగానే ఉండిపోతుంది. అదే విధంగా మనిషి తయారు చేసి వినియోగిస్తున్న క్లోరో ఫ్లోరో కార్బన్ రసాయనాలు కూడా వందేళ్ల పాటు వాతావరణంలో నిల్వ ఉండి ఆ తరువాత మాత్రమే అదృశ్యమవుతాయి. గత 600 సంవత్సరాలతో పోలిస్తే, గత 100 సంవత్సరాలలో భూగోళం వేడెక్కడం అధికమయింది. ముఖ్యంగా గత 10 –15 సంవత్సరాల్లో మరీ ఎక్కువయింది.

గ్లోబల్ వార్మింగ్ - వ్యాధులు

నానాటికీ వేడెక్కుతున్న భూగోళం అనేక వ్యాధులకు కారణం అవుతోంది. స్వీడన్‌లో అనేకమంది చావుకు కారణమయిన టి.బి.ఇ (టిక్ బోర్నో ఎన్‌సెఫలైటిస్) వ్యాధి వ్యాప్తికి కారణం వాతావరణంలో ఉష్ణోగ్రత పెరగడమే అంటున్నారు. 1970 చివరి రోజుల్లో ప్రతి పదిలక్షల మందిలో పది మందికి సోకిన ఈ వ్యాధి 1990లో మూడింతలయింది. స్వీడన్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతవల్ల 'ఇక్సోడెస్ రెసినస్' అనే వైరస్ విజృంభిస్తోందని కనుగొన్నారు. ఇది దోమలను ఆశ్రయించి వాటి ద్వారా మనిషి శరీరంలోకి ప్రవేశించి టి.బి.ఇ (ఒకరకమైన మెదడువాపు వ్యాధి) వ్యాధికి దారి తీస్తోంది. అంతే కాదు స్పైరోచెట్ అనే బ్యాక్టీరియా సైతం తన వంతుగా లైమ్ డిసీజ్, ఎర్లీ బయోసిస్ వంటి వ్యాధులను రెచ్చగొడుతోంది. విషజ్వరం సోకి కండరాలను, కీళ్లను విపరీతంతగా బాధిస్తోంది. మంచులో నిద్రాణ స్థితిలో ఉన్న వైరస్ గ్లోబల్ వార్మింగ్ వల్ల చేతనావస్థలోకి వచ్చి వ్యాధులు కలిగించే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. పూర్తిగా నిర్మూలమైన పలు ప్రాణాంతక వ్యాధులు మళ్లీ విజృంభించే అవకాశం ఉందంటున్నారు.

విలయం అంచున భూగోళం

♦ మానవ కార్యకలాపాల వల్ల పెరిగిపోతున్న భూతాపం వల్ల సముద్రాలు సలసలా కాగిపోతున్నాయి. ప్రకృతి గతి తప్పుతోంది. ♦ వేసవి ఒక్కటే ఎక్కువ కాలం ఉంటోంది. మిగతా సీజన్లు రావలసిన కాలాల్లో రావడంలేదు. వచ్చిన తర్వాత కూడా ముందుగానే ముగిసిపోతున్నాయి. ♦ ఎండలు మండిపోతున్నాయి. రాను రాను వర్షాలు తగ్గిపోతున్నాయి. భూగర్భజలాలు పాతాళంలోకి వెళ్లిపోతున్నాయి. ♦ మండుటెండలవల్ల వడగాల్పులు, కరువు కాటకాలు, అధికమవుతున్నాయి. జలవనరులు క్షీణించిపోతున్నాయి. ♦ గత 5 దశాబ్దాలలో ఆర్కిటిక్ ధ్రువప్రాంతంలో ఒక హిమఖండం మందం 40 శాతం కరిగిపోయింది. ♦ సముద్రాలు పొంగి, వరదలొచ్చి ఆస్తి నష్టం ప్రాణనష్టం సంభవిస్తున్నాయి. గత మూడు వేల సంవత్సరాలతో పోలిస్తే, గత 100 సంవత్సరాలలో సముద్ర మట్టాలు మూడు రెట్లు వేగంగా పెరిగాయి. ♦ హిమఖండాలు అదృశ్యమైతే హిమనదులు ఎండిపోయే ప్రమాదం ఉంది. గంగా, యమున వంటి నదులు కొన్ని సంవత్సరాలలో పిల్ల కాల్వల్లా మారిపోయే ప్రమాదం ఉంది.

మరికొన్ని ప్రమాదాలు

♦ గ్లోబల్ వార్మింగ్ వల్ల భూ అయస్కాంత శక్తి తగ్గిపోతుంది. ఇది మానవాళిపై ఒక పిడుగు పాటు. గత 300 సంవత్సరాలలో భూ అయస్కాంత శక్తి 30 శాతం క్షీణించింది. ♦ వాతావరణం వేడెక్కడం దోమలకు అయాచిత వరం. పొడి వాతావరణంలో అవి మరింత విజృంభించి మలేరియా, కలరా, డెంగ్యూ వంటి వ్యాధులను కల్గిస్తాయి. ♦ సముద్ర మట్టాలు పెరిగి మాల్దీవులు వంటి దేశాలు పూర్తిగా మటుమాయం కావచ్చు. ♦ గ్లోబల్ వార్మింగ్ ప్రపంచ సమస్య. అన్ని దేశాలు కలిసికట్టుగా కదలి ఇందుకు పరిష్కార మార్గాలను అన్వేషించి ఆచరణలో పెట్టాలి. ♦ ప్రస్తుత ఇంధన విధానంలో మార్పులు తీసుకురావాలి. జనాభా నియంత్రణను సమర్థవంతంగా చేపట్టాలి.

★

కొత్తమార్గం

న్యూ ఢిల్లీలోని ఒక విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యార్థి ఉద్యమాల నేపథ్యంలో సాగే నవల "విముక్తి మార్గం". వామపక్ష ఉద్యమాల చీలిక, కాంగ్రెస్- బిజెపి వైఖరులు, బిజెపి మతోన్మాద చర్యలు, మండల కమీషన్ రిపోర్టు అనంతర పరిణామాలు, దళితవాద ఉద్యమాలు వీటన్నిటి చుట్టూ అభయ్‌మౌర్య అల్లిన కథ 'విముక్తి మార్గం'. హిందీలో 'ముక్తిపథ్' పేరుతో విడుదలైన ఈ నవలను శ్రీమతి ఆర్. శాంత సుందరి తెలుగులోకి అనువదించారు. కథలోకి వెళితే... హర్యానాలోని మారుమూల ప్రాంతానికి చెందిన విజయ్, నఫేసింగ్, రణబీర్‌సింగ్, మహేష్ ఉన్నత చదువులకోసం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చేరతారు. అక్కడ కొంతమంది ఇతర విద్యార్థులతో కలిసి వామపక్ష విద్యార్థి సంఘాన్ని స్థాపిస్తారు. ఆ ఉద్యమాన్ని నడపడంలో పలు చిక్కులు ఎదురౌతాయి. అనేక సమస్యలు ముందుకొస్తాయి. ఉన్నత కుటుంబానికి చెందిన మధులిత వీరి ఉద్యమాలకు సహకరిస్తుంది. హాస్టల్‌లో సౌకర్యాల మెరుగుకోసం, స్కాలర్‌షిప్‌ల కోసం, విశ్వవిద్యాలయంలోని అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహిస్తారు. దేశ రాజకీయాలన్నీ విశ్వవిద్యాలయంలో ప్రతిబింబిస్తాయి. మతశక్తులకు, వామపక్ష ఉద్యమానికి పోటీ జరుగుతుంది. చదువుకొనే రోజుల్లో ప్రేమించుకున్న రణబీర్‌సింగ్, సీమ జంటను కలపడం కోసం విద్యార్థి ఉద్యమనాయకులు అష్టకష్టాలు పడతారు. హర్యానాలోని గ్రామీణప్రాంతాల్లో వున్న బలమైన కట్టుబాట్లను ఎదిరించడానికి ప్రయత్నిస్తారు. దళితుడైన నఫేసింగ్ రేఖను కులాంతర వివాహం చేసుకుంటాడు. అదే గ్రామం నుండి చదువుకోవటానికి వచ్చిన దళితుడు మహేష్. స్వార్థమే పరమావధిగా వ్యవహరిస్తుంటాడు. అన్నిరకాల దురలవాట్లకు లోనవుతాడు. తన సొంత ప్రయోజనం కోసం కులాన్ని ఉపయోగించుకుని నాయకుడిగా ఎదుగుతాడు. కుల ఉద్యమాల పేరుతో పాలకవర్గం వామపక్ష ఉద్యమాలను నాశనం చేయడానికి ఏవిధంగా ప్రయత్నిస్తుందో స్పష్టంగా గమనిస్తాము. సామాజిక మార్పు కోసం సుదీర్ఘకాలం ప్రయాణించాల్సి వుందన్న సందేశంతో 'విముక్తిమార్గం' ముగుస్తుంది. విద్యార్థులు తప్పనిసరిగా చదవాల్సిన నవల ఇది. రచయిత ప్రొ॥ అభయ్‌మౌర్య హైదరాబాద్‌లోని ఇంగ్లీషు & ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) వైస్‌ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన బహుభాషావేత్త, అనేక గ్రంథాల రచయిత. హర్యానాలో ఒక చిన్న రైతు కుటుంబంలో జన్మించి ఉన్నత స్థాయికి ఎదిగారు.

విముక్తి మార్గం- అభయ్‌మౌర్య, పేజీలు : 280, వెల : 125/-. ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. మరియు ప్రజాశక్తి అన్ని పుస్తక కేంద్రాలలో.

-కారుసాల

కొత్త పుస్తకాలు

సుందర దృశ్య కావ్యాలు

ప్రఖ్యాత రచయిత, జర్నలిస్టు అడివి బాపిరాజు అలనాటి తెలుగు చక్రవర్తుల సామ్రాజ్య వైభవాన్ని నేపథ్యంగా తీసుకొని రచించిన చారిత్రక నవలల్లో అద్భుతమైనవి 'అడివి శాంతిశ్రీ....అంశుమతి'. పెద్ద నవల అడివి శాంతిశ్రీ, చిరు నవల అంశుమతి రెండూ కలిపి ఒకే పుస్తకంగా వెలువరించింది విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 1946 నాటి అడివి శాంతిశ్రీ, 1951 నాటి అంశుమతి నవలలను ఇప్పుడు చదవడం పాఠకులకు కొత్త అనుభూతినిస్తుంది. క్రీస్తుపూర్వం నాటి తెలుగు చక్రవర్తుల పరిపాలనను, అప్పటి చరిత్రను ఆధారం చేసుకొని పలు చారిత్రక నవలలను మనోహర దృశ్యకావ్యాలుగా మలచిన బాపిరాజు ఈ రెండు నవలలను కూడా ఆద్యంతం ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. 'హీరోయిన్ ఓరియంటెడ్' నవలలైన అడివి శాంతిశ్రీ, అంశుమతి నవలలను తెలుగు భాషపై ప్రేమ, పట్టు ఉన్నవారు మాత్రమే చదవగలరు. ఎందుకంటే ఈ రెండు నవలలు పూర్తి గ్రాంథికంలో ఉన్నాయి. సాధారణ తెలుగు తెలిసినవారు చదవడం కష్టమే కాదు, బోర్ ఫీలవుతారు. కొన్ని పదాలకు అర్థాలు తెలుసుకోవాలంటే నిఘంటువు వెతుక్కోవాల్సిందే. అయితే అడివి బాపిరాజు శైలిలో ఉన్న అద్భుతమైన 'లయ' చకచకా చదివిస్తుంది. మొదటి నవల అడివి శాంతిశ్రీ నేపథ్యం శాతవాహన సామ్రాజ్యం. ఇది శాంతిశ్రీ-బ్రహ్మదత్తుని కథ. రెండో నవల అంశుమతి నేపథ్యం వేంగీ సామ్రాజ్యం అంటే చాళుక్యుల పరిపాలన. ఇది కుబ్జ విష్ణువర్ధనుడు-అంశుమతీ కుమారి ప్రణయగాథ. అడివి శాంతిశ్రీ నవలలో బౌద్ధ ధర్మం కూడా బ్యాక్ డ్రాప్‌గా ఉంటుంది. ఆనాడు విజయపురి (ఇప్పటి నాగార్జునసాగర్ ప్రాంతం) బౌద్ధ ధర్మాన్ని అత్యున్నత దశకు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఆ విశేషాలు ఈ నవలలో ఉన్నాయి. ఈ రెండు నవలలతో పాటు బాపిరాజుగారి ఇతర చారిత్రక నవలలు చదివిన తరువాత ఇలాంటి నవలలు రాయడం కత్తి మీద సాము అనే సంగతి అర్థమవుతుంది. ఇవి చరిత్రను ఆధారం చేసుకొని రాసిన నవలలు కాబట్టి చారిత్రక విషయాలపై లోతైన అవగాహన తప్పనిసరి. ముఖ్యంగా వేల ఏళ్ల కిందటి సామాజిక వాతావరణాన్ని ప్రతిబింబించడం అంత సులభం కాదు. ముఖ్యంగా తెలుగు భాషా సౌందర్యం, సొగసు, దాని సున్నితత్వం తెలిసిన వారు మాత్రమే చారిత్రక నవలలను రక్తికట్టించగలరు. ఇందుకు బాపిరాజే

అర్హులని చెప్పవచ్చు. ఈ రెండు నవలలు చదివిన తరువాత మన తెలుగు చక్రవర్తుల సామ్రాజ్య వైభవం తెలియడమే కాకుండా, అందమైన దృశ్య కావ్యాలుగా మనసులో ముద్రపడతాయి.

అడివి శాంతిశ్రీ-అంశుమతి, చారిత్రాత్మక నవలలు, వెల: రూ.160, పేజీలు: 284.ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్, అబిడ్స్, హైదరాబాద్.

- ఎం. నాగేందర్



న్యాయ నిర్ణేతవూ నీవే

కె.విల్సన్‌రావు

వెల : 30/-

పేజీలు :72

ప్రతులకు :

కె.రాజమణి, ఎల్.ఐ.సి ఆఫీసర్స్ కాలనీ, గాంధీనగర్,

యెలమంచిలి-531055, విశాఖ.

వీక్షణం

సాయి లక్కరాజు

వెల : 50/-,

పేజీలు : 112

ప్రతులకు :

స్వరలయ వేదిక

14-7-7, మారీసు పేట,

తెనాలి-522202



ఎవరా ఒక్కరు?!

బుజ్జాయిలూ...కింద చాలా రకాల బొమ్మలున్నాయి. వాటితో చక్కగా ఆడుకోవచ్చు. తినొచ్చు. కాకపోతే వాటిలో ఒక్కటి మాత్రం కొంచెం తేడాగా ఉంది. అదేంటో కనిపెట్టండి.

క్విజ్‌మాస్టర్



1. 'క్విట్ ఇండియా' అంటే ఏంటి?
2. 'డు ఆర్ డై' (సాధించు లేదా మరణించు) అనే నినాదం తెచ్చింది ఎవరు?
3. గాంధీజీ పూర్తిపేరు?
4. గాంధీజీని 'మహాత్మా' అని మొదట ఎవరు పిలిచారు?
5. దండి సత్యాగ్రహం ఎప్పుడు, ఎక్కడ మొదలయింది?

- ఆర్. పంచారామ్,
పదవతరగతి, ఊటిపల్లి.

మీరూ ఇలా 5 ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా : క్విజ్ మాస్టర్, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

ఈల పాట పక్షి

ఇవాళ మనం చెప్పుకోబోయేది కస్తూరి పక్షి గురించి. నీలం, నలుపు రంగు కలబోతగా ఉంటుంది దీని దేహం. నుదుటి మీద, భుజాలమీద ఆకుపచ్చ, నీలిరంగు కలిసిన మచ్చలుంటాయి. ముక్కూ, కాళ్లూ నల్లగా ఉంటాయి. ఇది ఎలాంటి ప్రదేశాల్లోనైనా జీవిస్తుంది. గుడ్లు పెట్టే కాలంలో ఉదయాన్నే భలేగా ఈల పాట పాడుతుంది. దీని ఈల పాట అచ్చంగా మనిషి ఈల వేసినట్లే అనిపిస్తుంది. మిగతా సమయాల్లో మౌనంగా ఉంటుంది. ఇది నీళ్లలో ఉండే కీటకాలను, నత్తలను, పీతలను ఆహారంగా తీసుకుంటుంది. జలపాతాల దగ్గర బండరాళ్లపై అటూ ఇటూ దూకుతూ నీళ్లలో కొట్టుకుపోతున్న ఎరలను పట్టుకుంటుంది. ఇది దాని తోకను విసనకర్రలా చేసి ఆడిస్తూ రాళ్లకింద, సందుల్లో ఉన్న ఎరను బయటికి తెస్తుంది. బాగా చిన్నగా ఉన్నప్పుడే తెచ్చి పెంచుకుంటే ఈ పక్షి బాగా మచ్చికౌతుంది. జలపాతాల దగ్గర్లో చెట్ల వేళ్లు, నాచు, పచ్చగడ్డి, బురద కలిపి గూడు కట్టుకుంటుంది.



ఐదు తప్పులెక్కడ?

హాయ్... పై బొమ్మ భలేగా ఉంది కదా. అంతా పల్లెటూరి వాతావరణం కానీ బుజ్జాయిలూ ఆ బొమ్మలో ఐదు తప్పులున్నాయి. అవి ఏంటో కనిపెట్టి చెప్తారుగా.

నేర్చుకుందామా...



ఎంత సమయం?

ఒక వ్యక్తి ఐదు మీటర్లు ఉన్న ఒక దుంగని మీటరు పొడవు ముక్కలుగా కోస్తున్నాడు. ఒక్కో ముక్క కోయడానికి ఒకటిన్నర నిమిషం పడుతుంది. అయితే ఐదు ముక్కలు కోయడానికి ఎంత సమయం పడుతుంది?

సాధ్యమేనా...?!

ఒక వ్యక్తికి మూడు రింగులు కలిసిన గొలుసులు 5 ఇచ్చి వాటన్నింటిని కలపమన్నారు. అతను నాలుగు రింగులను తెంపి ఆ ఐదింటిని అతికించాడు. అయితే ఇంకా తక్కువ రింగులు తెంపి వాటిని అతికించడం సాధ్యమౌతుందా?

ఏది సరిపోతుందో



ఫ్రెండ్స్... పక్కన కొన్ని అంకెలు, గుర్తులు ఉన్నాయి. వాటిలో 29X3÷5 అక్కడున్న మిగతా వాటికి సమానం. అది ఏ వరుసలో చేస్తే వస్తుందో చేసి చూడండే!

సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో కొన్ని అంకెలు కూడా వున్నాయి. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు. అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి. సరేనా...

5								
	2			5	9	4	7	
4		9					1	
				3	5			
		1	7	9	8	5		
			6	1				
	8					9		3
	6	3	2	7			5	
								4

జవాబులు

సుడోకు:

5	1	6	8	4	7	2	3	9
3	2	8	1	5	9	4	7	6
4	7	9	3	2	6	8	1	5
2	9	7	4	3	5	6	8	1
6	3	1	7	9	8	5	4	2
8	4	5	6	1	2	3	9	7
7	8	4	5	6	1	9	2	3
9	6	3	2	7	4	1	5	8
1	5	2	9	8	3	7	6	4

ఏది సరిపోతుందో...:



2×46÷5÷3×29

క్విజ్‌మాస్టర్: 1.ఇండియాను వదిలి వెళ్లమని చెప్పడం, 2.మహాత్మా గాంధీ, 3.మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ, 4.రవీంద్రనాథ్ టాగూర్, 5.1930వ సంవత్సరం, మార్చి12న, దండిలో మొదలయింది..

ఎంత సమయం?: సాధారణంగా అందరూ 1.5×5=7.5 నిమిషాలు అనుకొంటారు. కానీ నాలుగో సారి కోసినప్పుడు ఐదవ ముక్క కూడా వస్తుంది. తిరిగి కోయాల్సిన పనిలేదు. అంటే 6 నిమిషాల్లో ఐదు ముక్కలు కోయగలడు. **సాధ్యమేనా...?!:** సాధ్యమే. ఒక గొలుసులోని మూడు రింగులను తెంపి వాటితో మిగతా నాలుగు గొలుసులను అతికించవచ్చు. **ఐదు తప్పులెక్కడ?:** 1.నీళ్ల తాగుతున్న పందికి కన్ను లేదు, 2.దాని పక్కదానికి తోక లేదు, 3. రెండు చేపలు నీళ్ల బయట ఉన్నాయి, 4. కోడి పుంజుకి తోక బాతు కాళ్లున్నాయి, 5. ఒక మనిషికి పాదం లేదు.

మాటల కోట - 54

రూపకల్పన : కర్లపాలెం

1		2	■	3	4	■	5	6
	■	7		■	8		■	
■	9		■	10		■	11	
12		■	13		■	14		■
	■	15		■	16			
17	18		■	19		■		■
■		■	20		■	21		22
23	■	24		■	25		■	
26			■	27		■	28	

అడ్డం :

1. మహా భారతం రచయితలలో ఒకరు (3)
3. తప్పు కానిది... తిరగబడింది (2)
5. 'జ' గుణింతంలో పువ్వు (2)
7. పశువుల మేత (2)
8. కొందరు కత్తికన్నా ఇది గొప్పదంటారు (2)
9. ఓడలు నిలిచే చోటు (2)
10. ఒకటి పక్కన ఏడు సున్నాలు (2)
11. ఇంగ్లీషు పాపాయి (2)
12. కాయలు కాయడం, రక్షించడం (2)
13. గుజరాత్ ముఖ్యమంత్రి పేరు చివరిపదం (2)
14. అవనిక (2)
15. నచ్చిన నాయకుని దేనితో ఎన్నుకుంటాం? (2)
16. చాలు.. చాలు.. శ్రీవారూ! ఇక .... (4)
17. మా లేని రమామణి (3)
19. కొండ (2)
20. తెలుగు కుమార సంభవం కర్త. .... చోడుడు (2)
21. చింతపండు రుచి (3)
24. ఎంకికి నాయుడు ఏమౌతాడు? (2)
25. రామాయణం రచయిత్రి (2)
26. ముళ్లపూడిగారబ్బాయి తిరగబడ్డాడు (3)
27. లజ్జ (2)
28. బంగాళదుంప (2)

నిలువు :

1. తిరిగొచ్చిన టెలిగ్రాం (2)
2. నవ్వు (3)
4. 1 (3)
6. చుట్టలు చుట్టలుగా ఉండే తియ్యటి పదార్థం (3)
9. మరుసటి రోజు (2)
10. పకోడిలో కొక్కొరొకో (2)
11. అమ్మకాలు కొనుగోళ్ల సందర్భంగా చేసేవి (5)
12. చేదు కూరగాయ (3)
13. మొరటు (2)
14. పాత రోజుల్లో సినిమా ప్రారంభానికి ముందు వచ్చే పాట ".... తీయరుగా" (2)
15. పల్లెటూరి ఆడపిల్లల వస్త్ర విశేషం (2)
16. బేసి సంఖ్యకాదు. అలాగని పూర్ణసంఖ్యా కాదు (2)
18. దేశమంటే .... ఇది కాదోయ్ అన్నారు గురజాడ (2)
19. ఓ వంటపాత్ర (2)
20. తాజా, తొమ్మిది (2)
21. అగ్గిపెట్టెలో అగ్గి దీనికే అంటుకునుండేది (2)
22. 'నువ్వుల'ని వీటితో కూడా పోలుస్తుంటారు (3)
23. కునికిపాట్లు పడు (2)
24. చంద్రబాబు నాయుడిని ఇలా పిలుస్తుంటారు తెలుగు తమ్ముళ్లు (2)
25. తూగు (2)

మాటలకోట - 53 జవాబు

1 అ	2 నే	3 కం	■	4 కాం	■	5 పా	6 క	7 ము
■	8 తా	చు	■	చ	■	■	9 మ	డి
10 పే	జీ	■	■	న	■	■	ల	■
రం	■	11 రా	12 నా	■	■	13 ఆ	ము	14 దం
టం	■	15 కా	చు	■	■	వు	■	తం
■	16 మ	సి	■	17 న	■	■	18 చా	■
19 ఆ	ది	■	20 బ	ల	■	21 త	రు	22 గు
మ	■	23 పు	చ్ఛ	ల	24 ప	ల్లి	■	ట
25 ని	ఘూ	■	లి	■	త్తి	■	26 కే	క



తుంటరికొచ్చిన తంటా

పానగల్లు గ్రామంలో తిరపయ్యనే తుంటరి బాలుడుండేవాడు. చిన్న పిల్లల్ని, ముసలివాళ్లని ఆటపట్టించేవాడు. "చాక్లెట్ ఇస్తాను. ఇటు రండి" అని మైదానంలో ఆడుకునే పిల్లల్ని దగ్గరకి పిలిచి ఒక బాక్స్ ఇచ్చేవాడు. వాళ్లు ఆశకొద్దీ గబాల్న దాన్ని తెరవగానే అందులో తేలో, కాళ్లజెర్రో ఉండేది. వాళ్లు భయంతో కింద పడేసి పరుగెత్తుతుంటే పగలబడి నవ్వేవాడు. అమాయకులు కనిపిస్తే చాలు కప్పల్ని పట్టి వాళ్ల జేబుల్లో వేసేవాడు. వాళ్లు కేకలు పెడుతుంటే సంబరపడేవాడు. అలాగే ముసలోళ్ల చేతి కర్రల్ని దాచిపెట్టి వాళ్లు ప్రాధేయపడుతుంటే ఆనందించేవాడు.

ఇలా ఉండగా, ఆ ఊరికి ఓ సారి నిర్మలానంద స్వామి అనే సాధువు వచ్చాడు. ఆయన ఊరి వెలుపలున్న సత్రంలో ఉండేవాడు. ఉదయంపూట ఎదురుగా ఉన్న మర్రిచెట్టు కింద ధ్యానం చేసుకునేవాడు. తర్వాత ఊళ్లోకెళ్లి భిక్షను అర్థించేవాడు. సాయంత్రం తన దగ్గరకు వచ్చిన వారికి 'ధర్మబోధ' చేసేవాడు. ఓ రోజు మర్రి చెట్టుకింద ధ్యానం చేసుకుంటున్నాడు నిర్మలానంద స్వామి. ఆ దారి వెంట పశువుల్ని అడవికి తోలుకుపోతున్న తిరపయ్య ఈ దృశ్యాన్ని చూశాడు. మెల్లగా సాధువు దగ్గరున్న కమండలాన్ని, కర్రను తీసుకుని ఎంచక్కా వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత కళ్లు తెరిచిన సాధువుకు కమండలం, కర్ర కనిపించలేదు. వెంటనే నుదిటినున్న విభూతిని రెండు వేళ్లతో తీసుకుని కింద చల్లాడు. లేచి ఊళ్లోకి భిక్ష కోసం బయలుదేరాడు.

స్వామి వెళ్లడం చూసిన తిరపయ్య 'సాధు మర్ గయా. ఓ సన్యాసీ హార్ గయా' అని రాగాలు తియ్యడం మొదలు పెట్టాడు. ఇంతలో ఎదురుగా ఓ రైతు రావడం చూసి "ఏం మావా! మీరంతా ఆ సాధువుకు మొక్కుతుంటారే. ఆయనకు మహిమలేం లేవు. ఇదిగో ఆయన బుడ్డి చెంబును పట్టుకొస్తున్నా" అన్నాడు కమండలాన్ని చూపిస్తూ.

గతంలో తిరపయ్య మూలంగా ఇబ్బందుల పాలైన ఆ రైతు "నీ మొహం. చెంబెక్కడరా? కర్రకి పామును తగిలించుకుని తిరుగుతున్నావు? కూరొండుకుంటావా ఏంట్రా?" అన్నాడు.

వెనక్కి తిరిగి చూసుకున్న తిరపయ్యకు భుజమ్మీది కర్ర, కమండలం మామూలుగానే కనిపిస్తాయి. రైతు తనను ఆటపట్టిస్తున్నాడనుకుని నవ్వుతూ ముందుకు సాగుతాడు. అలా దారిలో వాడికి ఎదురైన ముగ్గురు నలుగురు కూడా అదే విధంగా మాట్లాడుతారు. అంత మందీ ఒకే మాట చెప్పేసరికి వాడిలో చిన్న అనుమానం మొదలవుతుంది. అది కమండలం కాదేమో! పామేనేమో!! అనుకుంటూ చూస్తాడు. అప్పుడు పాము వేలాడుతూ కనిపించింది. కెవ్వుమని కేకేసి కర్రను వదిలి పెట్టాడు. కిందపడ్డ పాము తిరపయ్య వెంటపడింది. దాన్ని తప్పించుకోడానికి బలంకొద్దీ పరుగెత్తాడు. కానీ అది నీడలా వెంటాడింది. తిరపయ్య ప్రాణభయంతో వాగులో దూకాడు. అయినా పాము వదల్లేదు. నీటిమీద ఈదుతూ వెంబడించింది. తిరపయ్య ఒడ్డుకు చేరుకుని నేరుగా మర్రిచెట్టు కిందికి పరుగెత్తాడు. కానీ అక్కడ సాధువు కనిపించలేదు. మళ్లీ వూళ్లోకి పరుగెత్తాడు. ఓ ఇంటిముందు "భవతీ భిక్షాందేహి" అని భిక్షకోసం అర్థిస్తున్న సాధువు కనిపించాడు. గబాల్న వెళ్లి స్వామి రెండు పాదాలు పట్టుకున్నాడు. "నన్ను క్షమించండి స్వామి. మిమ్మల్ని అవమానించాను. మీ కమండలం దొంగిలించాను. అది కాస్తా పాముగా మారి నా వెనకాలే పడ్డది. అది భయంకరంగా కోరలు చాపి కరవడానికి నామీదికొస్తోంది. నా తప్పును మన్నించండి. దయచేసి ఆ పామును ఉపసంహరించండి" అన్నాడు వేడుకుంటూ.

"పిల్లల్ని ప్రేమగా చూడాలి. పెద్దవాళ్లను గౌరవించాలి. అమాయకుల పట్ల, అనాథల పట్ల కరుణ కనబరచాలి. కానీ అల్లరి చేయడం, అవమాన పరచడం చేయకూడదు. ఇకముందు అలా చేయనని ప్రమాణం చేస్తేనే ఆ పామును ఉపసంహరిస్తాను" అన్నాడు సాధువు.

"మీ పాదాల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను స్వామి. ఎవ్వరినీ కించపరిచే విధంగా మాట్లాడను. అవమానపడే పనులు చేయను. పిల్లల్ని ప్రేమిస్తా. పెద్దవాళ్లకు సేవచేస్తా. అమాయకుల్ని, అనాథల్ని నా అన్నదమ్ముల్లా చూసుకుంటా" అని ప్రమాణం చేశాడు సాధువు పాదాలు పట్టుకుని.

సాధువు చిరునవ్వుతో వాడి తలమీద చెయ్యివేసి "ఓరి అర్భక బాలుడా! లే... లేచి చూడు. అది కమండలమే" అన్నాడు. పాము స్థానంలో కమండలం కనిపించింది.

"హమ్మయ్య బతికిపోయాను. ఇంక జన్మలో ఇలాంటి తుంటరి పనులు చేయను స్వామి" అని అక్కడ్నించి వెళ్లిపోయాడు. పదిమంది కలిసి తిరపయ్యలో మార్పు తీసుకొచ్చారు. అందుకు గ్రామ ప్రజలు సంతోషించారు.

- పుప్పాల కృష్ణమూర్తి





పొగ వద్దు

వేలెడంత లేని సిగరెట్ చెట్టంత మనిషిని ఏం చేస్తుంది?! అనుకుంటారేమో! చెట్టు చాటునో, గోడ మాటునో నిలబడి గుప్పగుప్పమని సిగరెట్ పొగ వదులుతుంటారు. ఆకాశంలోకి చూస్తూ అలౌకికానందాన్ని పొందుతుంటారు. వాస్తవాలు వింటే దిమ్మ తిరిగిపోవడం ఖాయం. మన శరీరంలోని ఊపిరితిత్తులు, కళ్లు, మెదడు, ముక్కు, తల, గుండెకు హాని చేసే రసాయనాలు సిగరెట్ పొగలో పుష్కలంగా వున్నాయి. ఎంత ఆరోగ్యంగా వున్న మనిషి అవయవాలనైనా సరే ఇవి క్రమంగా నిర్వీర్యం చేసేస్తాయి. మరీ ముఖ్యంగా ఊపిరితిత్తులను ఎంతో ఇష్టంగా నంజుకు తినేస్తాయి. పొగ తాగేవారే కాదు! వారి పక్కన వుండేవారికీ తిప్పలు తప్పవు. ఏం చెప్పినా ఎన్ని చెప్పినా పొగరాయుళ్లకు చెవికెక్కవు కదా. అలాగని చెప్పకుండా వదిలేస్తామా! చెప్తూనే వుంటాం.